18వ వసంతంలోకి
నేటి దినపత్రిక
# సూర్య
www.suryaa.com
చిత్తూరు | తిరుపతి
మంగళవారం | 5 నవంబర్ 2024 | పేజీలు 11

## శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

తిరుచానూరులోని పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 28 నుండి డిసెంబరు 6వ తేదీ జరుగనున్న కార్తీక బ్రహ్మోత్సవాల రోజువారి కార్యక్రమాల బుక్‌లెట్‌ను సోమవారం టీటీడీ ఈఓ జె.శ్యామలరావు ఆవిష్కరించారు.



4లో

## సైబర్ క్రైం అవగాహన వారోత్సవాలు ప్రారంభం

**ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు**

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్:**

సైబర్‌క్రైం అవగాహన వారోత్సవాలు ప్రారంభం సోమవారం శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు మహిళా విశ్వవిద్యాలయ ఉపకులపతి వి.ఉమ, అదనపు ఎస్పీలు జ్యోతి ప్రజ్వలన గావించి, సైబర్ క్రైమ్ అవగాహన సదస్సుల వారోత్సవాలను ప్రారంభించారు. జిల్లా ఎస్పీ ఎల్.సుబ్బరాయుడు మాట్లాడుతూ ఇటీవల కాలంలో మన దైనందిన జీవితంలో ఇంటర్నెట్, స్మార్ట్ మొబైల్, కంప్యూటర్ ఒక భాగం అయిపోయాయి. ఇవి లేకుండా మనకు ఒక రోజు జరగడం కష్టంగా ఉంది. ఈ అవకాశాన్ని ఆసరాగా తీసుకుని సైబర్ నేరగాళ్లు ప్రజలను సులభంగా బురిడీ కొట్టించి ఆర్థికంగా దోచుకుంటూ మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేస్తూ మోసం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి సైబర్ నేరాల గురించి విద్యార్థులైన మీకు అవగాహన కల్పిస్తే మీరు చైతన్యవంతులై మీ తోటి వారిని కూడా చైతన్యపరిచి సైబర్ క్రైమ్ రూపుమాపాలనే ముఖ్య ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా సైబర్ క్రైమ్ నిపుణుడు ఐఎల్.నరసింహారావు చేత సైబర్ క్రైమ్ అవగాహనసదస్సులను ఏర్పాటు చేస్తున్నామని, ఈ అవకాశాన్ని విద్యార్థులు యువత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కోరారు. మనీ ట్రాప్, హనీట్రాప్ వంటి సైబర్ నేరానికి ఎవరూ అతీతులు కాదని చదువుకున్న యువతీ యువకులు, విద్యార్థులు, ఉద్యోగస్తులు వయోవృద్ధులు ఎక్కువగా ఈ వలలో పడి మోసపోతున్నారని వారు ఏ విధంగా బయటపడాలో తెలియక ఆర్థికంగా నష్టపోయి మానసికంగా కృంగిపోయి ఆత్మహత్య వరకు వెళుతుండడం చాలా బాధాకరమన్నారు. సైబర్ క్రైం జరిగినప్పుడు ఏ విధంగా ఎక్కడ సంప్రదించి న్యాయం పొందాలి అనే విషయాలను తెలియజేస్తూ, సైబర్ క్రైమ్ బారిన పడకుండా సైబర్ నేరగాలను కట్టడి చేసే




మిగతా 2లో

## పీజీఆర్ఎస్‌లో వచ్చిన అర్జీలను
## నిర్దేశిత సమయంలోగా అర్థవంతంగా పరిష్కరించాలి

**ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 181 అర్జీలు**
**కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్దేశించిన సమయం లోపు పరిష్కారం చూపాలని, అలసత్వం వహించరాదని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ అధికారులకు సూచించారు. సోమ వారం ఉదయం స్థానిక జిల్లా కలెక్టరేట్ నందు ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్‌తో జిల్లా కలెక్టర్ ప్రజల నుండి అర్జీలు తీసు కున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి నరసింహులు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ దేవేందర్ రెడ్డి, పిడి డ్వామా శ్రీనివాస ప్రసాద్, జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, జిల్లా పంచాయతీ అధికారిని సుశీల దేవిలు కూడా పాల్గొని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులను స్వీకరించారు. శాఖల వారీగా అర్జీల వివరాలు రెవెన్యూ -119, సివిల్ సప్లై-4, పోలీస్ శాఖ-13, పంచాయతీరాజ్ శాఖ-10, హౌసింగ్- 2, టిడ్కో -2, సర్వే శాఖ-12, స్కూల్ ఎడ్యుకేషన్ -4, డ్వామా-3, సెకండరీ హెల్త్ డిపార్ట్మెంట్ -1, సేర్ప్-2, ట్రైబల్ వెల్ఫేర్-విద్యుత్ శాఖ-1, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ -2, ఆర్టీసీ -1, ఆర్ డబ్ల్యూ ఎస్ - 2, ఎండోమెంట్స్ -1 రిజిస్ట్రేషన్ శాఖ -1 వెరసి మొత్తం 181 వినతులు రావడం జరిగిందని అధికారులు అందరు సదరు అర్జీలపై ప్రత్యేక దృష్టి సారించి వేగవం తంగా నాణ్యతగా, అర్థవంతంగా పరిష్కరించాలని గ్రీవెన్స్‌కు హాజరయిన వివిధ శాఖలకు సంబందించిన అధికారులకు జిల్లా కలెక్టర్ సూచించారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 38వినతులు

**కమిషనర్ ఎన్.మౌర్య**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 38వినతులను వచ్చాయని నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య తెలిపారు. ప్రజల నుండి వచ్చిన వినతులు ఆయా విభాగాల అధికారులు వెంటనే పరిష్కరించాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. నగరపాలక సంస్థ పరిధిలో నిర్మించిన మాస్టర్ ప్లాన్ రోడ్లలో అక్రమాలు జరిగాయని, నగరంలోని సి.సి.రోడ్లలో ఉన్న గుంతలు పూడ్చాలని, లక్ష్మీపురం కూడలి తదితర ప్రాంతాల్లో డ్రైనేజీ కాలువలు వేర్వేరుగా నిర్మించాలని డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ, తమ వార్డుల్లో పర్యటించి సమస్యలు పరిష్కరించాలని కార్పొరేటర్ అనిల్ కుమార్ కమిషనర్‌ను కోరారు. తమ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డుకు స్థలం తీసుకున్న టిడిఆర్. బాండ్లు ఇప్పించాలని, తమ బిడ్డ జనన ధ్రువీకరణ పత్రం మార్పులు వారం అవుతున్న చేయలేదని, నగరపాలక సంస్థలో విలీనం అయినా సెట్టిపల్లి ఉద్యోగులకు జీతాలు ఇవ్వాలని, తన తల్లి పేరు మీద ఉన్న పన్నును వేరొకరికి మార్చారు పరిష్కరించాలని, రాహుల్ రెస్ట్‌హౌస్ సమీపంలో డ్రెయినేజీ నీరు ఆగుతున్నాయని, మల్టిలెవల్ కార్‌పార్కింగ్ పనులు జరుగుతూనే ఉన్నాయని దీంతో మా వ్యాపారాలు పూర్తి తగ్గాయని, మాకు ప్రత్యామ్నాయం చూపాలని వ్యాపారస్తులు కోరారు. అన్నింటినీ క్షుణ్ణంగా పరిశీలించిన కమిషనర్ ఆయా విభాగాల అధికారులకు అర్జీలను కేటాయించారు. అన్ని అర్జీలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాం సుందర్, మునిసిపల్ ఇంజినీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువఅన్వేష్, రెవెన్యూ ఆఫీసర్ రవి, డీసీపీ మహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవనశాఖ అధికారి హరికృష్ణ, ఫైర్‌ఆఫీసర్ శ్రీనివాసులు రెడ్డి, డిఈలు, ఏసీపీలు, శానిటరీ సూపర్ వైజర్లు ఉన్నారు.



## విమానాశ్రయాలకు ధీటుగా
## రైల్వే స్టేషన్ల ఆధునికీకరణ



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:**

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ సారథ్యంలో వికసిత భారత్‌లో భాగంగా దేశంలోని అన్ని రైల్వే స్టేషన్లను ఆధునికరించడం జరుగుతుందని, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్‌లోని రైల్వే స్టేషన్లు కూడా కొత్త రూపును సంతరించుకో నున్నాయని అనకాపల్లి పార్లమెంటు సభ్యులు, కేంద్ర రైల్వే కమిటీ ఛైర్ పర్సన్ డాక్టర్ సిఎం.రమేష్ అన్నారు. సౌత్ సెంట్రల్ రైల్వే అధికారులతో కలిసి కేంద్ర రైల్వే కమిటీ సభ్యులు సోమవారం తిరుపతిలో సమావేశమై, తిరుపతి రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులను పరిశీలించారు. ప్రయాణీకులకు మెరుగైన వసతులతో, అత్యున్నత ప్రమాణాలతో విమానాశ్రయాలకు ధీటుగా రాష్ట్రంలోని రైల్వేస్టేషన్‌లను తీర్చిదిద్దడం జరుగుతుందని, అవసరమైన ప్రదేశాలలో రైల్వే ఓవర్‌బ్రిడ్జిలు, అండర్ బ్రిడ్జిల నిర్మాణం, ప్రజావసరాలకు అనుగుణంగా తిరుపతి రైల్వే స్టేషన్ వద్ద పార్కింగ్ సదుపాయం నిర్మించడం జరుగుతుందని ఈ పర్యటనలో పాత్రికేయులకు సీఎం.రమేష్ వివరించారు.



# పార్టీ క్యాడర్‌లో వర్గ పోరు పెట్టేందుకు చెవిరెడ్డి యత్నం

## టీడీపీ రూరల్ మండలాధ్యక్షుడు ఈశ్వర్ రెడ్డి ఆరోపణ

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి టిడిపి క్యాడర్ లో వర్గపోరు పెట్టాలని చూస్తున్నారని టిడిపి తిరుపతి రూరల్ మండలం అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివారం తిరుపతి రూరల్ మండల పరిధిలో జరిగిన వైసిపి చిత్తూరు, తిరుపతి జిల్లాల అధ్యక్షుడిగా భూమన కరుణాకర్ రెడ్డి ప్రమాణస్వీకార కార్యక్రమంలో చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తన అక్కస్సును వెల్లబుచ్చారన్నారు. తన కుమారుడు ఓటమికి తెలుగుదేశం పార్టీకి చెందిన కొందరి పేర్లు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. టిడిపికి చెందిన వారు ఆ పార్టీ అభ్యర్థి గెలుపుకు పనిచేస్తారే గాని అవతలి పార్టీ వారికి ఎలా పనిచేస్తారని, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన ఆరోపణలు చాలా విడ్డూరంగా ఉన్నాయన్నారు. తన గురువు అయిన భూమన కరుణాకర్ రెడ్డి, ఆయన కుమారుడు అభినయ రెడ్డికి ఎమ్మెల్యే టికెట్లు రానీయ్యకుండా తెరవెనుక ప్రయత్నాలు చేయడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తన కుమారుడిని పసికందుతో పోల్చి ఇంతమంది కలిసి ఓడిచ్చారని టిడిపి నేతల పేర్లు చెప్పడం చూస్తుంటే టిడిపి క్యాడర్లో వర్గపోరు సృష్టించడానికే అని తెటతెల్లమైందన్నారు. అధికారంలోకి వచ్చిన నాటి నుండి నేటి వరకు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడానికి, అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడానికి ఎమ్మెల్యే పులివర్తి నాని కృషి చేస్తున్నారన్నారు. వైసిపి క్యాడర్పై ఇప్పటి వరకు మేము ఒక్క కేసు అయిన అక్రమంగా నమోదు చేయించామా అని ప్రశ్నించారు. ఇకనైనా మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి నియోజికవర్గ అభివృద్ధికి సహరించాలని సూచించారు. ఈ విలేకరుల సమావేశంలో మాజీ జెడ్పిటిసి సభ్యుడు రమేష్ రెడ్డి, కత్తి సుధాకర్, మధు, కన్నయ్య నాయుడు, శ్రీనివాసులు పాల్గొన్నారు.




# రక్తదానం చేద్దాం.. ఇతరుల ప్రాణాలు కాపాడుదాం

**కుప్పం, మేజర్‌న్యూస్:** రాజ్యాధికారం బ్లడ్ డోనర్స్ తరఫున 3000 మందికి రక్తదానం చేయడంతో విజయోత్సవం చేసుకోవ డం జరిగిందని యువ నాయకులు నవీన్ తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తూర్పు రాయల సీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ డాక్టర్. కంచర్ల శ్రీకాంత్, ఏపీఎస్ ఆర్టీసీ రాష్ట్ర వైస్‌చైర్మన్ పి.ఎస్.మునిరత్నంలు హాజరయ్యారు. రక్తదానం చేద్దం ప్రాణాలను కాపాడుదాం అనే లక్ష్యంతో రాజ్యాధికారం బ్లడ్ డోనార్స్ కుప్పంలో3000 మందికి రక్తదానం చేయడంతో విజయోత్సవం చేసుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. యువత పెద్ద ఎత్తున ముందుకు వచ్చి రక్తం దానం చేసి.. ఇతరుల ప్రాణాలు కాపాడాలని పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంకి సహకరించిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ సురేష్, జనసేన పార్టీ కుప్పం ఇంచార్జ్ నరేష్, కుప్పం మాజీ ఎంపిపి డాక్టర్.వెంకటేష్, కుప్పం మాజీ జెడ్పీటీసీ రాజకుమార్, పీఈఎస్ ఆసుపత్రి బ్లడ్ బ్యాంక్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల యాజమాన్యం వాళ్ళు పాల్గొన్నారు.



# నూతన ఆలోచనలకు ఆహ్వానం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** ప్రాంతీయ వ్యవసాయనా పరిశోధనా స్థానంలో నూతన ఆలోచనలకు ఆహ్వానం పలుకుతూ పోషన్ ఇంక్యూబేటర్‌లో కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీవెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ విసి డాక్టర్ జెవి రమణ ముఖ్యఅతిథిగా పాల్గొని నూతన ఆలోచనలకు ఆహ్వానం అనే పోస్టర్లను విడుదలతో పాటు, 8వ కోహెూర్ట్, బ్యాచ్ అంకుర సంస్థల దరఖాస్తుల ఆహ్వానంను ఆయన ఘనంగా ప్రారంభించారు. మూడు స్కీములకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. మొదటిది యోచ్" 5 లక్షల వరకు ఐడియా ఫండింగ్, రెండవది "అగ్రి ఇన్వో" 25 లక్షల వరకు ఫండింగ్ ఈ సంవత్సరం సరికొత్తగా విద్యార్థుల కొరకు మూడవ స్కీమ్ "మెరిస్టు"ను ప్రారంభించామని తెలిపారు. ఇందులో భాగంగా సరికొత్త అంకుర సంస్థల ఆలోచనలోతో వచ్చే విద్యార్థులకు 4లక్షల వరకు ఫండింగ్ ఇవ్వనున్నట్లు డా.కదిరి మోహన్ అన్నారు. దరఖాస్తుదారులు డిసెంబర్ 4 లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు వెబ్ సైట్ లో పొందుపరిచామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్వీ అగ్రికల్చర్ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఎంవి రమణ, ఏడిఆర్ డాక్టర్ వి సుమతి, కోఆర్డినేటర్ డాక్టర్ కే విశ్వనాథ్, సైంటిస్టులు పాల్గొన్నారు.



# అసంఘటిత రంగంలో మహిళల సమానత్వంపై పుస్తకం ఆవిష్కరణ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో న్యాయవిభాగంలో అకడమిక్ కన్సల్టెంట్‌గా పని చేస్తున్న డాక్టర్ విడుదల సౌభాగ్య రాణి రచించిన పుస్తకం "అసంఘటిత రంగంలో సమానత్వం కోసం మహిళల తపన" వర్సిటీ ఉప కులపతి, రిజిస్ట్రార్‌లు ఆవిష్కరించారు. విసి, రిజిస్ట్రార్‌లు మాట్లాడుతూ నిరంతర పరిశోధకురాలిగా డాక్టర్ సౌభాగ్యరాణి ఈ పుస్తకం రచించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అసంఘటిత రంగంలో మహిళల యొక్క పాత్ర, పరిశ్రమ గురించి ఈ పుస్తకంలో చక్కగా వివరించారని కొనియాడారు. ఈ పుస్తకం ఆమె రచించడం పట్ల విసి, రిజిస్ట్రార్‌లు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పూర్వపు సైన్స్ కళాశాల అధ్యక్షులు ఆచార్య కె.త్యాగరాజు, పలువురు ఆచార్యులు, అధ్యాపకులు, న్యాయ విభాగం అకాడమిక్ కన్సల్టెంట్లు, పరిశోధకులు పాల్గొన్నారు.



# సైబర్ క్రైం అవగాహన వారోత్సవాలు ప్రారంభం

(మొదటిపేజీ తరువాయి)

మార్గాలను ప్రజలకు తెలియజేయాలని ముఖ్య ఉద్దేశంతో జిల్లా వ్యాప్తంగా ఒక వారం రోజులపాటు సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులను నిర్వహించి ప్రజలలో చైతన్యం తీసుకురావాలని సంకల్పించాం. అందులో భాగంగా మొదటగా శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో వైస్‌ఛాన్సలర్ వి.ఉమ రిజిస్టర్ ఎన్.రజనీ సహకారంతో ప్రముఖ సైబర్ క్రైమ్ నిపుణులైన ఐ.ఎల్. నరసింహారావు చేత ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశామన్నారు. ఆన్లైన్ జాబ్స్, పార్ట్ టైం జాబ్స్ అని, ఆధార్ కార్డు అప్డేషన్ అని, బ్యాంకు అప్డేట్ అని, మన యొక్క ఐడెంటిటీని సైబర్ నేరగాళ్లు వాడుకుని మన వాళ్లను ట్రాప్ చేస్తున్నారని, ఇలా పలు రకాలుగా ప్రపంచవ్యాప్తంగా సైబర్ టెర్రరిజం, సైబర్ క్రైమ్‌ల ద్వారా రోజుకు ఒక సరికొత్త ఎత్తుగడలతో ప్రజలను సులభంగా మోసం చేసి ఆర్థికంగా దోచుకుంటున్నారు. వారికి కళ్లెం వేయాలంటే సైబర్ నేరగాలను ఛేదించడం కంటే సైబర్ నేరాన్ని నివారించడం ఉత్తమ మార్గమని జిల్లా ఎస్పీ తెలిపారు. ఏ దేశానికైనా ఆ దేశ యువత వెన్నెముక, కావున క్రమశిక్షణతో మీ సంకల్పాలను సాధించి, భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరాలి. యువత బాగుంటే రాష్ట్రం బాగుంటుంది దేశం బాగుంటుందన్నారు. ఈ సైబర్ క్రైమ్ అవగాహన సదస్సులను సద్వినియోగం చేసుకొని మీరు అవగాహన పెంచుకొని, మీ తోటి స్నేహితులకు బంధువులకు తెలియజేసి వారిని చైతన్యపరిచి సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా సైబర్ నేరాలను నియంత్రించాలన్నారు. ఇటీవల కాలంలో గంజాయి వంటి మత్తు పదార్థాలు యూనివర్సిటీలు కాలేజీలలో విద్యార్థులే లక్ష్యంగా చేసుకొని అసాంఘిక శక్తులు పనిచేస్తున్నాయని వాటికి సంబంధించిన ఏమైనా సమాచారం తెలిస్తే వెంటనే డయల్ 100 లేదా 112 లేదా తిరుపతి పోలీస్ వాట్స్‌అప్ నెంబర్ 8099999977కు సమాచారం



ఇస్తే డ్రగ్స్‌పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు. శ్రీ పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం ఉపకళపతి వి.ఉమ మాట్లాడుతూ ప్రపంచంలో మనకు ఏది ఊరికనే రాదనే విషయాన్ని గ్రహించాలి కష్టపడి పని చేస్తేనే మనకు అన్ని లభిస్తాయి అనే విషయాన్ని విద్యార్థులు గ్రహించాలి. సాంకేతిక పరిజ్ఞానం అనేది జీవన ప్రమాణాలను పెంచే విధంగా ఉండాలి కానీ సైబర్ నేరగాళ్లు టెక్నాలజీని సమాజ వినాశనానికి ఉపయోగించడం బాధాకరమన్నారు. సైబర్ క్రైమ్ నిపుణులు ఐఎల్ నరసింహా రావు మాట్లాడుతూ సైబర్ నేరాలపై అవగాహన లోపం కారణంగా సులభంగా సైబర్ నేరగాల చేత చిన్న పిల్లల నుండి పెద్దల వరకు మోసపోతున్నారని, అనవసరంగా యాప్‌లను ఇన్స్టాల్ చేసి రకరకాల పర్మిషన్లను ఇవ్వకుండా జాగ్రత్త వహించాలని, పాస్‌వర్డ్‌లను ఓటీపీలను ఎట్టి పరిస్థితులలో ఎవరికీ తెలియజేయకుండా అప్రమత్తంగా ఉండి సైబర్ నేరాలను అరికట్టడంలో భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు వెంకట్రావు పరిపాలన, రవి మనోహరచారి శాంతి భద్రతలు, మహిళా యూనివర్సిటీ రిజిస్టర్ రజిని, డీఎస్పీలు వెంకటనారాయణ తిరుపతి, శ్రీలత మహిళా పోలీస్ స్టేషన్, మహిళా విశ్వవిద్యాలయ ఆచార్యులు, పోలీస్ అధికారులు, సైబర్‌క్రైం సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



# భక్తి శ్రద్ధలతో వారాల నోములు

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండలంలోని అభీష్టద మృత్యుంజయేశ్వర స్వామి ఆలయంలో భక్తిశ్రద్ధలతో కేదారేశ్వరస్వామి నోములు నోచుకోవడం జరిగింది. ఈ నోములకు పట్టణం నుండి కాకుండా చుట్టుప్రక్కల ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ వ్రత విధానము వలన కలిగే ఫలాలను పండితులు భక్తులకు తెలియజేశారు. అలాగే ఈ వారాలనోములు కార్తీక మాసంలో ప్రతి సోమవారం చేసుకోవడం ఆనవాయితీగా వస్తుంది. అంతే కాకుండా ఏకాదశి నందు కూడా నోములు నోముకోవడం ఆనవాయితీగా వస్తుంది. ఈ కేదారేశ్వర నోములను భక్తులు భక్తిశ్రద్ధలతో చేసుకున్నారు.

# రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించిన వారు నీతులు చెప్పడం సిగ్గుచేటు

## టీడీపీ తిరుపతి పార్లమెంటు అధ్యక్షుడు నరసింహ యాదవ్

**తిరుపతి ప్రెస్‌క్లబ్, మేజర్‌న్యూస్:** గత ఐదేళ్ల వైసిపి పాలనలో రాష్ట్రాన్ని అన్ని రకాలుగా భ్రష్టు పట్టించిన అప్పటి సీఎం జగన్ నుండి ఎమ్మెల్యేల వరకు ఇప్పుడు అధికారం పోగానే నీతులు చెప్పడం సిగ్గుచేటని టిడిపి సీనియర్ నేత, తిరుపతి పార్లమెంట్ అధ్యక్షుడు గొల్ల నరసింహ యాదవ్ అన్నారు. సోమవారం స్థానిక ప్రెస్క్లబ్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నిన్నటి రోజు జరిగిన వైయస్సార్సిపి పార్టీ మీటింగ్‌లో వాళ్ల మంత్రులు మాట్లాడిన మాటలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఎందుకంటే గత ప్రభుత్వ హయాంలో ఈఉమ్మడి చిత్తూరు జిల్లాకి ఎన్ని కంపెనీలు తీసుకొచ్చారు? ఎంత అభివృద్ధి చేశారు? ఎన్ని ప్రాజెక్టులు పూర్తి చేశారో అది ప్రజలకు చెప్పాలనీ డిమాండ్ చేశారు. రాష్ట్ర స్థాయి నేతలు జగన్ రెడ్డికి ముఖ్య సలహాదారులు రాష్ట్రంలో ఎంత అభివృద్ధి చేస్తే ప్రజలు మీకు 11 సీట్లు ఇచ్చారనేది చిత్తశుద్ధితో పరిశీలన చేసుకోవాలి. తల్లి చెల్లికి న్యాయం చెయ్యాలన్న దానిపై ఎవరూ అక్కడ మాట్లాడలేదు. బాబాయి హత్యపై ఎవరు ప్రస్తావించలేదు. టీటీడీ నిధులకు కన్నం వేసిన వ్యక్తులపై మాట్లాడేందుకు ఎవరికి కూడా నోరు రాలేదు. తిరుపతికి ఏ ఒక్క మంచి పని చేశామని చెప్పుకునేందుకు వారికి నోటి మాట రాలేదు. ఎంతసేపు కుప్పంలో గెలుస్తాం, కుప్పంలో గెలుస్తామని జగన్ రెడ్డి, పెద్దిరెడ్డి, కరుణాకర్ రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి, రోజా ముక్త కంఠంతో ఏ విధంగా డప్పు కొట్టుకున్నారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. మరి ప్రతిపక్ష హెూదా కూడా జగన్ రెడ్డికి లేకుండా కేవలం 11 సీట్లుకే ప్రజలు పరిమితం చేశారు. ఎందుకు ప్రజలు అక్కడికే పరిమితం చేశారో దాన్ని పరిశీలించుకోండి. చంద్రబాబు నాయుడుపై ఆవాకులు, చవాకులు పేలడం వల్ల మీకు



ఒరిగేదేమీ లేదు. కరుణాకర్‌రెడ్డిని ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షునిగా చేసి ఏదో రేపు తెల్లారికి జగన్ రెడ్డి సీఎం అయిపోయినట్టు పార్టీ అధ్యక్ష పదవికి కూడా ప్రమాణ స్వీకారం చేపించడం చాలా విడ్డూరంగా ఉందని ఎద్దేవా చేసారు. చిన్న బిడ్డ వాడమాలపేట దగ్గర అత్యాచారం చేసి చంపబడితే, చిత్తూరు జిల్లా ప్రతిష్టలు దిగజార్చిన నటి రోజా అక్కడికి వెళ్లి ఆ కుటుంబానికి ధైర్యం చెప్పి అండగా ఉండాల్సింది పోయి దౌర్భాగ్య రాజకీయాలు చేయడం ఆమె దిగజారినతనానికి నిదర్శనమన్నారు. చిత్తూరు జిల్లాలో మైన్స్ మినిస్టర్‌గా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జిల్లా మైన్స్ మొత్తం అక్రమ పద్ధతిలో కొల్లగొట్టేశారు. దాని గురించి వైసీపీ పెద్దలు మాట్లాడితే బాగుంటుందనీ హితవు పలికారు. అక్రమాలన్నీ వారు చేసి, మాపై యూటర్న్ పద్ధతిలో బురద జల్లడం ఎంతవరకు ప్రజలకు అబద్ధాలు చెబుతారని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ టౌన్ బ్యాంక్ చైర్మన్ పులిగోరు మురళీ కృష్ణారెడ్డి, కార్పొరేటర్ ఆర్‌సి.మునికృష్ణ, పార్లమెంట్ కార్యదర్శి యశ్వంత్ రెడ్డి, రాజయ్య, మీడియా కో-ఆర్డినేటర్ చెంగయ్య, ఎస్సీ నాయకుడు వెంకటరత్నం, బీసీ నాయకులు చిత్తూరు రవిశంకర్, గంధం బాబు తదితరులు పాల్గొన్నారు

## నైపుణ్య గణనకు సంబంధించి శిక్షణ

**చౌడేపల్లి, మేజర్‌న్యూస్:** మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయం నందు సచివాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది, మెడికల్ డిపార్ట్మెంట్ అందరికీ కూడా ఇవ్వడం జరిగింది. ఇందులో భాగంగా ఎంపీడీవో లీలా మాధవి, ఈఓపిఆర్డి కృష్ణవేణి పాల్గొన్నారు. రాబోవు నెల రోజులలో స్కిల్ సెన్సెస్ అన్నటువంటి ఒక వినూత్నమైన కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టబోతుంది. ఇందులో భాగంగా ఈరోజు అందరికీ శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో భాగంగా స్కిల్స్ సెన్సెస్ అనేది డోర్ టు డోర్ ఏ విధంగా చేయాలి అన్నటువంటి సమాచారాన్ని వివరించడం జరిగింది.



## శివాలయాలకు పోటెత్తిన భక్తులు

**కోట, మేజర్‌న్యూస్:** కార్తీక సోమవారం సందర్భంగా కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. కార్తీక మాసంలో శివాలయాల్లో నిత్య పూజలు జరుగుతుంటాయి. అందులో భాగంగా కోట మండలం జరుగుమల్లి –కొక్కుపాడు గ్రామాల మధ్య ఉన్న ఉమా సమేత సంతానేశ్వర స్వామి ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో మొదలై గణపతి పూజ, అమ్మవారికి అభిషేకం, స్వామివారికి రుద్రాభిషేకం,తదితర పూజలు అభిషేకాలు నిర్వహించారు. పుచ్చలపల్లి రఘురామిరెడ్డి, జ్యోతి వారి కుటుంబ సభ్యులు కార్తిక సోమవారం సందర్భంగా అమ్మవారికి బంగారు తాళిబొట్టు, అమ్మవారికి స్వామివారికి నూతన పట్టు వస్త్రాలు సమర్పించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నదానం నిర్వహించారు. సాయంత్రం స్వామివారి ఆలయంలో ఆకాశదీపం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు పుచ్చలపల్లి దినేష్ రెడ్డి తెలిపారు.



## అత్తి కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** కార్వేటినగరం మేజర్ పంచాయతీ గుండు గురుస్వామి వీధిలో వెలసిన అన్నపూర్ణ సమేత అత్తి కాశీ విశ్వేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం ఆలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## నేడు ఈ ప్రాంతాల్లో విద్యుత్తు అంతరాయం

**తిరుచానూర్, మేజర్‌న్యూస్:** నేడు ఉదయం 09బీ00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంట వరకు 33/11కేవీ విద్యుత్ మరమ్మతుల కారణంగా మరియు చెట్టు కొమ్మలు క్లియరెన్స్ వర్క్ కొరకు విప్పమనుపట్టెడ, సూరప్ప కసం, బ్రాహ్మణ పట్టు, పాటూరు, వినాయక నగర్, కొత్తూరులోని గ్రామాలలో విద్యుత్తు అంతరాయం ఏర్పడుతుందని ఏపిఎస్పీడి సీయల్ ఆపరేషన్ డివిజన్ కార్య నిర్వహ అధికారి విన్నకోటి చంద్రశేఖర్‌రావ్ సోమవారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలియచేశారు. కావున ప్రజలు విద్యుత్ అంతరాయన్ని గమనించి సహకరించాలని కోరుతున్నాము.

## ద్విచక్ర వాహనాల తనిఖీ

**పుంగనూరు, మేజర్‌న్యూస్:** పట్టణ పరిధిలోని పుంగమ్మచెరువు కట్టపైన సోమవారం సాయంత్రం 7గంటల సమయంలో ఎస్సై లోకేష్ తన సిబ్బందితో కలిసి ద్విచక్ర వాహనాలను తనిఖీ చేశారు వాహన చోదకులు హెల్మెట్లు ధరించి వాహనాల నడపాలని ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వల్ల ఉపయోగాలు గురించి వివరించి వారికి అవగాహన కల్పించారు. 18 సంవత్సరాల నిండి డ్రైవింగ్ లైసెన్స్ కలిగిన వారు మాత్రమే ద్విచక్ర వాహనాలను నడపాలని వారికి తెలియజేశారు డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా, రికార్డులు సరిగా లేకున్నా వాహనాలు నడిపే వారికి జరిమానా విధించారు.



## సకాలంలో పీజీఆర్ఎస్ వినతులు పరిష్కరించాలి

**నగర కమిషనర్ పి. నరసింహ ప్రసాద్**

**చిత్తూరు కార్పొరేషన్, మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కారవేదిక ద్వారా అందే వినతులను సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ పి.నరసింహ ప్రసాద్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక కార్యాలయంలో "ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక" కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా నగర ప్రజలు వివిధ సమస్యలపై కమిషనర్ కు వినతి పత్రాలు అందించారు. పలు సమస్యలపై కమీషనర్ అక్కడికక్కడే సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడానికి చర్యలు చేపట్టారు. ఫిర్యాదులు, వినతులపై సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించాలన్నారు. గతవారం అందిన అర్జీల పరిష్కారంపై సమీక్షించారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ –3, టీపీవో–1, మెప్మా–1 చొప్పున మొత్తం ఐదు వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో సహాయ కమిషనర్ ఎ.ప్రసాద్, ఎంఈ వెంకటరామి రెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కార దిశగా కృషి చేయాలి

**జిల్లా కలెక్టర్ డా. ఎస్ వెంకటేశ్వర్**

**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో (పిజిఆర్‌యస్) ప్రజల ద్వారా అందే ప్రతి అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తూ రీఓపెన్ అయిన ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో జిల్లాలోని పలు శాఖల జిల్లా అధికారులు, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ప్రజా సమస్యల పరిష్కార వేదిక నందు అందిన అర్జీల పరిష్కారం మరియు రీ ఓపెన్ ఫిర్యాదులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్నికి అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. సమస్య పరిష్కారం నిమిత్తం వచ్చే ప్రజల అర్జీలను ఎప్పటికప్పుడు తాసిల్దారులు, ఎంపీడీవోలు క్షేత్ర స్థాయిలో పరిశీలించి తగు ఎండార్స్మెంట్ ఇవ్వాలని, అర్జీలను నిర్ణీత గడువు లోపు నాణ్యమైన పరిష్కారం చూపాలని తెలిపారు. బియాండ్ ఎస్ఎల్ఏకు వెళ్ళకుండా చర్యలు చేపట్టాలన్నారు. అర్జీదారుడు సంతృప్తి చెందేలా అర్జీలు తిరిగి రీ ఓపెన్ కాకుండా సమస్యను పరిష్కరించాలన్నారు. సమస్య పరిష్కారానికి చొరవ చూపడంతో పాటు పరిష్కారం కాని సమస్యలకు సంబంధించి పరిష్కారం చేయకపోవడానికి గల కారణాలను అర్జీదారునికి వివరిస్తూ ఎండార్స్మెంట్ ఇవ్వాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, డిఆర్ఓ నరసింహులు, మున్సిపల్ కమిషనర్లు ఆర్డీవోలు, ఎంపీడీవోలు జిల్లా, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## అర్జీల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వండి

**జిల్లా జాయింట్ కలెక్టర్ విద్యాధరి**



**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:** ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీల పరిష్కారంనకు అధికారులు అధిక ప్రాధాన్యత ఇవ్వాలని జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి ఆదేశించారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా జిల్లా సచివాలయంలోని నూతన గ్రీవెన్స్ హాల్ నందు జిల్లా జాయింట్ కలెక్టర్, ట్రైనీ కలెక్టర్ హిమ వంశీ, డిఆర్ఓ మోహన్ కుమార్,చిత్తూరు ఆర్‌డిఓ శ్రీనివాసులతో ప్రజల నుండి అర్జీలు స్వీకరించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా అధికారులు అర్జీల పరిష్కారంలో క్షేత్ర స్థాయిలో అధికారులు సిబ్బందితో సమన్వయం చేసుకుని అర్థవంతమైన సమాధానాలు ఇవ్వాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందిన అర్జీలకు అర్థ వంతమైన సమాధానమిస్తూ పరిష్కారం చూపాలన్నారు. అర్జీలు రీ ఓపెన్ అయినట్లైతే వాటికి గల కారణాలను వివరించాల్సి ఉంటుందన్నారు.

## రీ పోస్ట్ మార్టం నిర్వహించిన స్విమ్స్ వైద్యులు

**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** ఇటీవల అనుమానస్పదలో స్థితిలో మృతి చెందిన వైయస్సార్సీపీ కార్యకర్త బండి చెంచయ్య మృతదేహానికి రీ పోస్ట్ మార్టం నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ హై కోర్ట్ న్యాయ స్థానం ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు స్విమ్స్ ఆసుపత్రి వైద్య నిపుణులు సోమవారం మండలంలోని వడ్డిపాలెం గ్రామ స్మశాన వాటిక నందు నాయుడుపేట డి.ఎస్పీ చెంచుబాబు ఆధ్వర్యంలో బండి చెంచయ్య మృతదేహానికి రీ పోస్ట్ మార్టం నిర్వహించారు. అనంతరం మృతదేహ నమూనాలను శేఖరించి వాటిని తిరుపతి ఫారెన్సిక్ ల్యాబ్‌కు తరలించారు. స్విమ్స్ వైద్య నిపుణులు డా.రూపేష్ నాయక్, డా. జ్యోతి ప్రసాద్ మాట్లాడుతూ హైకోర్ట్ ఆదేశాలు మేరకు స్థానిక పోలీసులు పర్యవేక్షణలో బండి చెంచయ్య మృతదేహానికి రీ పోస్ట్ మార్టం నిర్వహించామని వారు తెలిపారు. హై కోర్టు కేటాయించిన సమయం లోపల బండి చెంచయ్య మృత దేహానికి చేసిన రీ పోస్ట్ మార్టం నివేదికను కోర్టుకు సమర్పిస్తామని తెలిపారు. నాయుడుపేట సీఐ సంఘమేశ్వరరావు, స్థానిక ఎస్సై కె.నాగరాజు, తహసీల్దార్ ద్వారకానాద్ రెడ్డి, రెవిన్యూ పోలీసు సిబ్బంది తదితరులు రీ పోస్ట్ మార్టంలో పాల్గొన్నారు.



## చెరువులను కాలుష్యం నుండి కాపాడుకుందాం

**ప్రకృతిని రక్షించుకుందాం... రైతు సంఘం డిమాండ్**



**గూడూరు, మేజర్‌న్యూస్:** చిల్లకూరు మండలంలోని కడివేడు రెవెన్యూలోని చెరువులో వ్యర్థాలు కలుపుతూ పర్యావరణానికి విఘాతం కలిగిస్తున్నట్లు రైతు కూలీ సంఘం నాయకులు ఆందోళపన వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం సబ్‌కలెక్టర్ కార్యాలయం ముందు రైతు సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేయడం నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ పోర్టు నుండి వ్యర్థాలు తెచ్చి కలుపుతున్న సన్ని బోయిన హరనాథ్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆ గ్రామాలకు సంబంధించిన రైతులు డిమాండ్ చేశారు. జిల్లా ప్రధానకార్యదర్శి హేమలత మాట్లాడుతూ కడివేడు, గ్రామ సమీపంలో నల్లటి రసాయనాలతో తో కూడిన వ్యర్థాలను పెద్దపెద్ద బ్యారెల్స్‌లో లారీలలో తెచ్చి పోయడంతో అవి పంట కాలవల ద్వారా చెరువులోకి ప్రవేశించి తెల్లగా ఉండే నీళ్లు రంగు మారి నల్లగా మారుతున్నట్లు పేర్కొన్నారు. రసాయన వ్యర్థాలు ప్రవేశించడంతో చెరువులో ఉన్న చేపలు చనిపో వడం, అవి తిన్న గ్రామప్రజలు అనారోగ్యం పాలవుతున్నారన్నారు. ఆ చెరువులో నీళ్లు తాగిన నోరులేని మూగజీవాలు పశువులు, మేకలు, గొర్రెలు, అక్కడికక్కడే మరణించడం వంటివి జరుగుతున్నాయని గతంలోనూ ఈ సమస్యపై ఆ గ్రామ రైతులు గూడూరు సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి గూడూరు ఆర్డీఓకి వినతి పత్రం ఇచ్చామన్నారు. అయినా సంబంధిత అధికారులలో స్పందన లేకపోవడంతో చుట్టు పక్కల కడివేడు, కమ్మవారిపాలెం, తిమ్మనగారి పాలెం, ముత్యాల పాడు, నాంచారంపేట, పారిచర్లవారిపాలెం, చేడిమాల, తిప్పగుంట పాలెం, గ్రామాలకు చెందిన సుమారు 1500 ఎకరాలు కాలుష్యం కోరల్లో చిక్కుకుని పోవడంతో పంటల సాగుబడిని రైతులు ఆపివేశామన్నారు. గూడూరు డివిజన్ రైతు సంఘం నాయకులు జోగి శివ కుమార్ మాట్లాడుతూ చెరువుని నాశనం చేయుటకు, చెరువు నీరుతో సాగు చేసుకుని రైతుల నాశనానికి పూనుకుంటూ ఉన్న సన్నిబోయిన హరినాథ్‌పై చట్టపరమైన చర్యలు తీసుకొని కెమికల్స్‌ను కలిపిన అతని చేతే చెరువుని శుద్ధి చేయించి, డ్యాంల ద్వారా కొత్త నీటిని పారుదల చేసి రైతులకు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు తల్లం ప్రసాద్, పెనుబోలు సాయిరెడ్డి, అభిలాష్ రెడ్డి, తిరుపతి సీనయ్య, సుమన్ రెడ్డి, గజేంద్రనాయుడు, పెంచలయ్య, ఎదనపర్తి కృష్ణారెడ్డి, రాధాకృష్ణ, కిరణ్, శీనయ్య, చంద్రమోహన్ నాయకులు రమణయ్య, సురేష్, శ్రీనివాసులు, అడపాల ప్రసాద్, ముత్యాలయ్య, చంద్రయ్య, నారాయణ పాల్గొన్నారు.



**CHANGE OF NAME**

I, CHINTAKAYALA GEETHA, (Old Name) R/o, 10/816-2, Pagadala Palli, Kodur, Annamayya DT AP. Have Changed My Sur Name As DADISETTI GEETHA (New Name), W/O CHINTAKAYALA VIJAY KUMAR

# శ్రీ పద్మావతి అమ్మవారి బ్రహ్మోత్సవాల బుక్‌లెట్ ఆవిష్కరణ

**తిరుపతి బ్యూరో, మేజర్ న్యూస్ :** తిరుచానూరులోని శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో నవంబరు 28 నుండి డిసెంబరు 6వ తేదీ జరుగనున్న కార్తీక బ్రహ్మోత్సవాల రోజువారి కార్యక్రమాల బుక్ లెట్ ను సోమవారం టీటీడీ ఈవో శ్రీ జె.శ్యామలరావు ఆవిష్కరించారు. తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో గల ఈవో కార్యాలయంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీ పద్మావతి అమ్మవారి కార్తీక బ్రహ్మోత్సవాలు నవంబరు 28వ తేదీ ధ్వజారోహణంతో ప్రారంభమవుతాయన్నారు. డిసెంబరు 2వ తేదీ గజవాహనం, డిశెంబరు 3న బంగారు రథం, డిశెంబరు 5న రథోత్సవం, డిశెంబరు 6వ పంచమితీర్థం వుంటుందని తెలిపారు. భక్తులు విశేషంగా పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో శ్రీ వీరబ్రహ్మం, డెప్యూటీ ఈవోలు శ్రీ గోవింద రాజన్, శ్రీమతి ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.



వాహనసేవల వివరాలు 28-11-2024, ఉదయం- ధ్వజారోహణం, రాత్రి - చిన్నశేషవాహనం, 29-11-2024 ఉదయం- పెద్దశేషవాహనం, రాత్రి హంసవాహనం, 30-11-2024, ఉదయం - ముత్యపుపందిరి వాహనం, రాత్రి - సింహవాహనం, 01-12-2024 ఉదయం - కల్పవృక్ష వాహనం, రాత్రి - హనుమంతవాహనం, 02-12-2024 ఉదయం- పల్లకీ ఉత్సవం - వసంతోత్సవం, రాత్రి-గజవాహనం, 03-12-2024, ఉదయం - సర్వభూపాల వాహనం - సాయంత్రం - స్వర్ణ రథం, రాత్రి - గరుడవాహనం, 04-12-2024 ఉదయం - సూర్యప్రభ వాహనం, రాత్రి - చంద్రప్రభ వాహనం, 05-12-2024 ఉదయం- రథోత్సవం, రాత్రి - అశ్వ వాహనం, 06-12-2024 ఉదయం - పంచమితీర్థం, రాత్రి - ధ్వజావరోహణం.



# ప్రజా ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

**- జిల్లా ఎస్పీ వి.ఎన్.మణికంఠ చందోలు**

**చిత్తూరు క్రైమ్, మేజర్‌న్యూస్:** ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువులోగా ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు ఆదేశించారు. సోమవారం నగరం లోని స్థానిక ఏఆర్ పోలీసు కార్యాలయం నందు ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు నేరుగా ఎస్పీని కలిసి తమ సమస్యలను విన్నవించుకున్నారు. ప్రతి ఫిర్యాదును సమగ్రంగా పరిశీలించి, త్వరితగతిన విచారణ జరిపి, బాధితులకు న్యాయం చేయడమే తమ లక్ష్యమని,ఈ ఫిర్యాదులపై తక్షణ చర్య తీసుకొని ప్రజలు న్యాయం పొందేలా చూడాలని సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

# 6 నుంచి అమ్మవారి చీరలు జాకెట్లు వేలం

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీతాతయ్యగుంట గంగమ్మ ఆలయంలో వెలసిన గంగమ్మ తల్లికి భక్తులు కానుకలుగా సమర్పించిన చీరలు జాకెట్లు ఈనెల 6 నుంచి డిసెంబర్ 31 వేలంపాట ద్వారా విక్రయాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో ఏ జయకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు, తిరిగి నాలుగు నుంచి ఏడున్నర వరకు నాలుగు కాళ్ల మండపం వద్ద దేవదయ శాఖ అధికారుల సమక్షంలో చీరలు జాకెట్లు వేలం పాట ఉంటుందని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని అమ్మవారి భక్తులు ప్రజలందరూ చేసుకోవాలని కోరారు.

# నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**తిరుపతి ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** వివిధ ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతులు చెట్లు తొలగింపు కారణంగా మంగళవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ ఉండదని విద్యుత్ ఆపరేషన్ కార్యనిర్వహణ అధికారి చంద్రశేఖర రావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 33 లెవెన్ కె.వి విద్యుత్ మరమ్మతులు కారణంగా చెట్టుకొమ్మలు క్లియరెన్స్ వర్కు కోసం విద్యుత్ నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఇప్పమాను పట్టిడ, సూరప్ప కచం, బ్రాహ్మణపట్టు, పాటూరు, వినాయక నగర్, కొత్తూరు లోని గ్రామాలలో విద్యుత్ అంతరాయం ఉంటుందని తెలిపారు. ఇందుకు ప్రజలు సహకరించాలని కోరారు.

# సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా స్వామి వారి దర్శనం కల్పించడమే లక్ష్యం

**- సీఎం బాబుని కలిసి ఆశీర్వాదం తీసుకొన్న టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం**

**కుప్పం, మేజర్ న్యూస్:** తిరుమల శ్రీ వెంకటేశ్వరుడు కొలువైన దివ్య క్షేత్రం. నిత్యం భక్తులతో కిటకిటలాడే పుణ్యక్షేత్రం. క్షణం పాటు వెంకన్న దర్శనం దొరికితే చాలని ప్రయాసపడే భక్తులు ప్రపంచంలోని నలుమూలల నుంచి కొండకు చేరుకోవడం నిత్యకృత్యం. ఆపదమొక్కుల స్వామి మొక్కులు తీర్చుకునేందుకు వచ్చే వచ్చే



సామాన్య భక్తులకు ఇబ్బంది లేకుండా స్వామి వారి దర్శనం కల్పించడమే లక్ష్యంమని టీటీడీ బోర్డు మెంబర్ శాంతారాం పేర్కొన్నారు.ఈ సంధర్భంగా విజయవాడలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలసి కుటుంబ సమేతంగా ఆశీర్వాదం తీసుకొన్నారు.అనంతరం తనకు టిటీడి బోర్డు మెంబర్ గా అవకాశం కల్పించినందుకు ముఖ్యమంత్రికి దన్యవాదాలు తెలిపారు.ఆప్యాయంగా మాట్లాడుతూ స్వీట్లు తినిపించుకొన్నారు. శాంతారాం మాట్లాడుతూ తిరుమలకు విచ్చేసే భక్తులందరికీ టీటీడీ అందించే శ్రీవారి దర్శనం, వసతి, ఇతర సౌకర్యాలు మరింత మెరుగ్గా కల్పించేందుకు, అందరి సమన్వయంతో భక్తులకు తిరుమల యాత్ర ఒక దివ్యానుభూతిని కల్పించేలా కృషి చేస్తున్నామని ఆయన తెలియజేశారు.

# పరిశోధన రంగంలో అభివృద్ధి అంశాలపై సమీక్ష

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఆంధ్రప్రదేశ్ ఉన్నత విద్యా మండలి ఇన్చార్జి ఛైర్మెన్ ఆచార్య రామ్మోహన్ ఆధ్వర్యంలో అభివృద్ధి అంశాలపై సోమవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రపంచ స్థాయి ర్యాంకులు సాధించే పేటెంట్లు, ప్రపంచస్థాయి జర్నల్స్ చర్చించి వాటిని మెరుగుపరచుకునేందుకు తగు సూచనలు చేశారు. ఎన్.ఐ.ఆర్.ఎఫ్. ర్యాంకులు, పరిశోధన రంగంలో వృద్ధి అంశాలపై చర్చించారు. అంతర్జాతీయ విద్యార్థులను చేర్చుకునేందుకు యస్వీయూ చొరవ చూపుడంతోపాటు పరిశోధనా రంగంలో విదేశీ పరిశోధకుల బృందంతో కలసి పనిచేయాలని కోరారు. ఈ సమీక్షలో యస్వీయూ ఇన్చార్జి ఉపకులపతి ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, ప్రిన్సిపాళ్లు ఆచార్య సుధారాణి, ఆచార్య తులసీ రామకృష్ణారెడ్డి, ఆచార్య ఆర్వీయస్ సత్యనారాయణ, ఆచార్య మోహన్ రెడ్డి, డీన్లు ఆచార్య చంద్రాయుడు, ఆచార్య కిశోర్,ఆచార్య బాలాజీ, ఆచార్య నరసింహ, దామోదర రెడ్డి, టాస్క్ ఫోర్స్ మెంబర్లు ఆచార్య పద్మావతమ్మ, ఆచార్య భారతి, ఆచార్య రాజశేఖర్, మీడియా కో ఆర్డినేటర్ ఆచార్య పి.సి.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



# పాత్రికేయుల సంక్షేమమే మా ప్రథమ కర్తవ్యం

**- ప్రెస్ క్లబ్ కార్యాలయం ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే బొజ్జల**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయాన్ని శాసన సభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ ప్రారంభం చేయడం నా పూర్వ జన్మ సుకృతుమని. శ్రీకాళహస్తి జర్నలిస్టులు సంక్షేమమే నా పరమ వదిగా భావించి వారు సంక్షేమం కొరకు నిరంతరం కృషి చేస్తానని తెలిపారు. జర్నలిస్టులకు హెల్త్ కార్డులు. ఇన్సూరెన్స్‌లు నా సొంత డబ్బులు వెచ్చించి ప్రతి జర్నలిస్టు కుటుంబాన్ని కాపాడుతానని తెలిపారు. తొందరలోనే మీరు కోరుకున్న స్థలంలో నూతన శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నిర్మాణం పూర్తి చేసి మీకు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. ప్రతి జర్నలిస్టు వాస్తవాలు ప్రచురించి ప్రజలకు ప్రజాప్రతినిధులకు వారదులుగా నిలవాలని కోరారు. శ్రీకాళహస్తి ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులందరూ ఐక్యంగా ముందుకు పోవాలని కోరారు. మీ జర్నలిస్టులలో విభేదాలు సృష్టించే వారిని పక్కనపెట్టి జర్నలిస్టులు సంక్షేమం కొరకు కృషి చేయాలని కోరారు. శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ నూతన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వై కోటేశ్వర బాబు. పి హరీష్ రాయల్ లను ఘనంగా సన్మానించారు. శ్రీకాళహస్తి పాత్రికేయులందరూ శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్ర కేయులు. తెలుగుదేశం పార్టీ నాయకులు. కార్యకర్తలు పాల్గొన్నారు.






# ఆపద్బాంధవుల ఆకలి కేకలు



**సోమల మేజర్‌న్యూస్:** ఆపద సమయం లో అత్యవసర వైద్యసేవలందించే 108 వాహనాల సిబ్బందికి ప్రస్తుతం కష్టాలొచ్చాయి.మూడు నెలల నుంచి వేతనాలు అందలేదు.ఇచ్చే కొంతమొత్తం లోనే కుటుంబాలను పోషిస్తున్నామని,అది కూడా నెలవారీగా ఇవ్వకపోతే జీవనం ఎలా సాగించాలని వారు ఆందోళన వ్యక్తం చేశారు.ఐనా ప్రభుత్వం వారు వారి మొర ఆలకించినట్లు లేదు.ఎందుకంటే కనీసం దసరా, దీపావళి పండుగల పూటైనా ,పాలకులు దయచూపుతారని ఆశించినా నిరాశే మిగిలింది.దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.యస్.రాజశేఖర్ రెడ్డి అమల్లోకి తెచ్చిన 108 అంబులెన్సులు ప్రజలకు సేవలు అందించడం లో ముందున్నాయి.వీటిని ప్రారంబించక మునుపు అత్యవసర సేవలకోసం ఆసుపత్రిలకు వెళ్ళాలంటే అద్దెవాహనాలకోసం గంటల తరబడి ఎదురుచూసి,వారు చెప్పిన అద్దె చెల్లించాల్సి వచ్చేది.ఆ దయనీయ పరిస్థితి నుంచి ఈ అంబులెన్సులు గట్టెక్కించాయి.పైసా ఖర్చులేకుండా,జాప్యం లేకుండా ఫోన్ చేసిన నిమిషాల్లోనే మన ముందుకు చేరుకుంటూ,వైద్య సేవలలో కీలకంగా మారిపోయాయి.ఇంతటి ప్రాధాన్యత ఉన్న అంబులెన్సులలో విధులలో ఉంటున్న ఉద్యోగులకు ప్రభుత్వం వేతన చెల్లింపులలో జాప్యం చేస్తుంది.చిరుద్యోగులైన టెక్నిషియన్స్,ఫైలట్లకు గత మూడు నెలల జీతాలు అందాల్సి ఉంది.పుంగనూరు డివిజన్ పరిధిలో 11 అంబులెన్సులు ఉన్నాయని,మొత్తం పైన 25 మంది టెక్నిషియన్లు,25 మంది ఫైలట్లు ఉన్నారని,ఒక్కోక్క ఉద్యోగి 12 గంటలు పనిచేయాల్సి ఉంటుందని,ప్రతి రెండు అంబులెన్సులకు అధనంగా ఒక ఫైలెట్,ఒక టెక్నిషియన్ ఉంటాడని వారు అన్నారు.8 సంవత్సరాలు అనుభవం కల్గిన టెక్నిషియన్ కు రూ.30వేలు,ఐదేళ్ళ లోపు వాళ్ళకు 16వేలు,8 సంవత్సరాలు పైన అనుభవం గల ఫైలట్లకు 28వేలు,ఐదేళ్ళ లోపు అనుభవం కల్గిన ఫైలట్లకు 16వేలు వేతనంగా చెల్లిస్తున్నారు.వీరికి ప్రతి నెలా 4 వ తేది నుండి 8 వ తేది లోపల జీతాలు చెల్లిస్తారు.జులై వేతనం ఆలస్యంగా చెల్లించారు.ఆగష్టు, సెప్టెంబర్ తో పాటు అక్టోబర్ కు సంబందించి మూడునెలల జీతాలు చెల్లించాల్సిఉందని సోమల లో పనిచేస్తున్నటువంటి టెక్నిషియన్ఈశ్వర్,ఫైలట్ శశిధర్ అన్నారు.కావున వెంటనే ప్రభుత్వం వారు మాగోడు పట్టించుకొని మాకు రావలసిన జీతాలు చెల్లించాలని వాళ్ళు డిమాండ్ చేశారు.

# శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో భక్తుల రద్దీ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** దక్షిణ కైలాస క్షేత్రం భక్తులతో కిటకిటాడుతున్నాయి. ముక్తి క్షేత్రం శివ నామస్మరణలతో మ్రారుమోగుతుంది. కార్తీక సోమవారాన్ని పురస్కరించుకుని దక్షిణ కైలాసంలోని శివాలయాలకు భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పరమేశ్వరుని దర్శించుకుంటూ భక్తిశ్రద్ధలతో ప్రణమిలుతున్నారు. ఉపవాస దీక్షలతో మహిళా భక్తులు కార్తీక దీపాలు వెలిగించి భక్తి ప్రభక్తులతో మ్రొకరిల్లుతున్నారు. కార్తీక మాసం మొదటి సోమవారాన్ని పురస్కరించుకొని దక్షిణ కైలాస క్షేత్రానికి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. శ్రీకాళహస్తి ఆలయంతో పాటు పరిసర ప్రాంతాల్లో శివక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడుతున్నాయి. పవిత్ర కార్తీక మాసంలో పరమేశ్వరుని దర్శించుకుని పూజిస్తే ముక్తి లభిస్తుంది అన్న పురాణ ఇతిహాసాల పేర్కొంటున్నాయి. మొదటి కార్తీక సోమవారం కావడంతో తెల్లవారుజాము నుంచి భక్తులు శివాలయాలకు తరలివచ్చి పూజలు చేపట్టారు. ముక్తి క్షేత్రమైన శ్రీకాళహస్తి ఆలయానికి స్థానిక భక్తులతో పాటు వివిధ ప్రాంతాలు నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి పవిత్ర పుణ్య నది సువర్ణముఖి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఉపవాస దీక్షలతో వాయులింగేశ్వరుని దర్శించుకుంటున్నారు. మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఉపవాసంతో శివాలయానికి విచ్చేసి స్వామివారి సన్నిధిలో కార్తీక దీపాలు వెలిగించి దీపపు పూజను సాంప్రదాయ పద్ధతిలో శాస్త్ర యుక్తంగా నిర్వహించి మొక్కులు చెల్లిస్తున్నారు. కార్తీక్ మాసంలో పరమేశ్వరుడు దీపం రూపంలో కొలువై ఉంటాడని భక్తుల నమ్మిక. అందుకే మహిళా భక్తులు ఉపవాస దీక్షలతో కార్తీక దీపాలు వెలిగించి భక్తిశ్రద్ధలతో పూజలు జరిపి తమ సౌభాగ్యంతో పాటు ఐశ్వర్యాలు సిద్ధించాలని పరమేశ్వరుని కోరుకుంటూ ప్రణమిల్లుతున్నారు. దక్షిణ కైలాస క్షేత్రంలో నీలకంఠేశ్వర స్వామి. మణికంఠేశ్వర స్వామి. అర్ధనారీశ్వర స్వామి. చక్రేశ్వర స్వామి తదితర అనుబంధ ఆలయాల్లో స్వామి వారికి విశిష్ట అభిషేక పూజలను శాస్త్ర యుక్తంగా నిర్వహించారు. మూలవిరాట్లకు విశిష్ట అలంకారాలు చేసి ధూపదీప నైవేద్యాలు నివేదించి. హారతులు సమర్పించారు. స్థానిక ఆలయాలను భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకుంటూ మొక్కులు చెల్లిస్తున్నారు. ముక్తి క్షేత్రం శివనామస్మరణలతో మారుమోగుతోంది.







## హెూం మంత్రి అనితను కలసిన ఎమ్మెల్యే గురజాల

**చిత్తూరు అర్బన్, మేజర్ న్యూస్:** రాష్ట్ర హెూం మంత్రి వంగల పూడి అనిత ని చిత్తూరు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సోమవారం మధ్యాహ్నం మర్యాదపూర్వకంగా కలిశారు. హెూం మంత్రి తిరుపతి నుండి అనంతపురం వెళ్తూ మార్గమధ్యలో చిత్తూరుకు విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పోలీసు అతిధి గృహం వద్ద హెూం మంత్రిని కలిసి పుష్పగుచ్చాలు అందించారు. ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలు, ఇతరత్రా అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ వి.ఎన్. మణికంఠ చందోలు పార్లమెంటు తెలుగు మహిళ అధ్యక్షురాలు కార్జాల అరుణ పాల్గొన్నారు.



## శ్రీ సద్గురు యోగి నారాయణ విగ్రహ ప్రతిష్ఠకు భూమి పూజ

**- హాజరైన ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ రాష్ట్ర వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నం**

**కుప్పం, మేజర్‌న్యూస్:** పట్టంలోని చెరువు కట్ట వద్ద శ్రీ సద్గురు యోగి నారాయణ బలిజ సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేస్తున్న శ్రీ సద్గురు యోగి నారాయణ విగ్రహ ప్రతిష్టకు భూమి పూజ కార్యక్రమాన్ని సోమవారం నిర్వచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, ఆర్టిసి రాష్ట్ర వైస్ చైర్మన్ పి.ఎస్.మునిరత్నంలు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కుప్పంలో శ్రీ సద్గురు యోగి నారాయణ విగ్రహంను కైవారం ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతిష్టించడం శుభపరిణామం అన్నారు. తెలుగుదేశం పార్టీ తరఫున అన్ని సహాయ సహకారాలు అందిస్తామని వారు తెలిపారు. కులమతాలకు అతీతంగా అందరూ బాగుండాలని ఆశీస్సులు అందించిన వ్యక్తి కైవారం తాతయ్య అన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం టిడిపి ఇన్చార్జ్ పిఎస్ మునిరత్నం, సద్గురు యోగి నారాయణ బలిజ సేవా ట్రస్ట్ అధ్యక్షులు ప్రభాకర్,డాక్టర్ సురేష్ బాబు, రాష్ట్ర కార్యదర్శి గోపీనాథ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సతేంద్ర శేఖర్, కౌన్సిలర్ సోము శేఖర్,మున్సిపల్ పార్టీ అధ్యక్షులు రాజకుమార్, జనసేన నరేష్, ఉమాపతి నాయుడు, రూరల్ బలిజ సంఘం అధ్యక్షులు డీలర్ వెంకటేష్, మాజీ ఎంపీటీసీ కృష్ణమూర్తి, కుంజేగానూరు వెంకటేష్, చలపతి, మంజునాథ్, ట్రస్ట్ సభ్యులు దితరులు పాల్గొన్నారు.

# శ్రీవారి సన్నిధిలో పలువురు ప్రముఖులు

**తిరుమల, మేజర్‌న్యూస్:** తిరుమల శ్రీవారిని సోమవారం పులురు దర్శించుకున్నారు. హెూంమంత్రి వంగలపూడి అనిత గర్భాలయంలో స్వామివారికి మొక్కులు చెల్లించారు. రంగనాయకుల మండపంలో అనితకు వేదాశీర్వచనం అందించిన పండితులు. రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్న సీఎం, డిప్యూటీ సిఎం,ఎన్డీయే కూటమి నాయకులకు ఆయురారోగ్యాలు ఉండాలి.రాష్ట్రం అభివృద్ధి పథంలో నడిచేలా, రాష్ట్ర ప్రజలు బాగుండాలని ప్రార్థించానని అన్నారు. అలాగే తెదేపా నేత బిటెక్ రవి.కూటమి ప్రభుత్వం ఏర్పడాక శ్రీవారి ప్రసాదాలు మెరుగయ్యాయి. బ్రేక్ దర్శన సమయం కూడా మార్పు చేస్తే బాగుంటుంది.ఈ విషయంపై సిఎం చంద్రబాబు దృష్టికి తీసుకొని వెళ్తానన్న బిటెక్ రవి. అలాగే పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్, సభ్యులు శ్రీవారిని దర్శించుకున్నారు. ఈ మేరకు ఆలయం వెలుపుల వైకాపా నేత అంబటి రాంబాబుపై తీవ్రస్థాయిలో విరుచుకుపడిన పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ సీఎం రమేష్.పీఎం నరేంద్ర మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు శ్రీవారి ఆశీస్సుల మెండుగా ఉండాలి.గత ఐదేళ్లలో రాష్ట్ర అభివృద్ధి కుంటూ పడింది.ఎన్డీయే కూటమి ప్రభుత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో నడవాలని కోరుకున్న. అనకాపల్లిలో నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నాం.శ్రీవారి ఆలయంలో పార్టీ జండా%% . జగన్ మోహన్ రెడ్డి స్టికర్ ను జేబుకు అతికించుకొని అంబటి రాంబాబు రావడం శోచనీయం.నిషేధం అని తెలిసిన ఎలా ఇలాంటి పనులు తిరుమలలో చేస్తారు.శ్రీ వేంకటేశ్వర స్వామి వారిపై అసలు గౌరవం వారికి కొంచం కూడా లేదు. ఎంత ధైర్యం ఉంటే ఇలాంటి పనులు చేస్తారు.ఇలాంటి వారు కొండపైకి రాకుండా చేయాలి.తిరుమల పవిత్రతను కోల్పోయేలా చేస్తున్నారు వైసీపీ నాయకులు.భగవంతుడి దగ్గరకు రమ్మంటేనే నేను హిందువును కానూ రాను అంటూ జగన్ తిరుమలకు రావడం లేదు.అలాంటి వ్యక్తి ఫోటీ జేబుపై వేసుకొని తిరుమలకు ఎలా వస్తారు.తిరుపతిలో రైల్వే అధికారులతో సమావేశం అయ్యాం. రైల్వే పనులపై విస్తృతంగా సమీక్ష నిర్వహించాం. తిరుపతి రైల్వే స్టేషన్‌లో ఈ రోజు, సికేంద్రబాద్ రైల్వే స్టేషన్ లో రేపు తనిఖీలు నిర్వహణ సీఎం రమేష్, పార్లమెంటరీ రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్.







## రెండు రోజుల్లో 1,72,565 మందికి శ్రీవారి దర్శనం

**- శ్రీవారి దర్శనాల్లో సామాన్య భక్తులకు పెద్దపీఠ**

**తిరుమల, మేజర్‌న్యూస్:** శ్రీవారి దర్శనాల్లో సామాన్య భక్తులకు వారాంతాల్లో టీటీడీ పెద్ద పీఠ వేస్తోంది. శని, ఆదివారాల్లో అత్యధిక మంది భక్తులు శ్రీవారిని దర్శించుకునేలా టీటీడీ చర్యలు చేపట్టింది. ఈ నేపథ్యంలో గత శని, ఆదివారాల్లో 1,72,565 మందికి టీటీడీ శ్రీవారి దర్శనం కల్పించింది. శనివారం 88,076 మంది, ఆదివారం 84,489 మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టింది.నారాయణగిరి షెడ్ల వద్ద ఇటీవలే ఏర్పాటు చేసిన సర్వీస్ లైన్ తో భక్తులు క్యూలైన్ లో వేచి ఉండే సమయం తగ్గింది.డిప్యూటీ ఈవోలు హరీంద్రనాథ్, లోకనాథం, రాజేంద్రలు వైకుంఠం క్యూ కాంప్లెక్స్, ఔటర్ క్యూలైన్లు, నారాయణగిరి షెడ్ల ను నిరంతరం పర్యవేక్షిస్తూ టీటీడీ సిబ్బంది, శ్రీవారి సేవకుల సహకారంతో భక్తులకు క్యూలైన్లలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. క్యూలైన్లలోని భక్తులకు అల్పాహారం, పాలు, తాగు నీటిని 24 గంటలు పంపిణీ చేశారు. భక్తులు సౌకర్యవంతంగా స్వామివారిని దర్శించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

## వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సు



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయంలోని మహిళా అధ్యయన కేంద్రం ప్రాజెక్ట్ అసోసియేట్ డాక్టర్.టి.చైతన్య ఆధ్వర్యంలో వ్యక్తిత్వ వికాసంపై అవగాహన సదస్సును సోమవారం హ్యూమానిటీ బ్లాక్ లోని సెమినార్ హాల్లో విద్యార్థులకు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి స్విమ్స్ సైకియాట్రిక్ అధిపతి డాక్టర్ గణేష్ కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై వ్యక్తిగత వికాసం లక్షణాలు, వివిధ రకాల వ్యక్తిగత వికాసాలపై అవగాహన కల్పించారు. విద్యార్థినులు భావోద్వేగాలను సమతుల్య పరచవలసిన సామర్థ్యాలను అభివృద్ధి చేసుకుంటూ ఆత్మస్థైర్యాన్ని పెంపొందించుకొని వారి వృత్తిపరంగా అభివృద్ధి చెందాలని పేర్కొన్నారు. విద్యార్థులు తమ ఆత్మ న్యూనత భావాన్ని విడనాడి ధైర్యంగా ముందుకు వచ్చి వారి భావాలను బహిరంగ సమావేశాలలో వ్యక్తపరచాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా అధ్యయన కేంద్ర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ముగిసిన విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో గత వారం రోజులుగా నిర్వహిస్తున్న విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు సోమవారం చెలికాని అన్నారావు సభా భవనంలో ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ వైస్-చాన్సలర్ ప్రొ.జిఎస్ఆర్ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా హాజరై విజిలెన్స్ అవగాహన ముఖ్య ఉద్దేశాన్ని తెలిపారు. భారతదేశాన్ని అవినీతి రహిత దేశంగా చేయడమే విజిల్స్ వారోత్సవాల ముఖ్య ఉద్దేశం అన్నారు. ప్రస్తుత కాలంలో ప్రతి చోటా అవినీతి మహమ్మారిగా వ్యాపించిందని, ఆ అవినీతిని కూకటివేళ్ళతో పెకిలించి, ఉత్తమ నీతియుక్త సమాజాన్ని స్థాపనకు కృషి చేయాలన్నారు. విశ్వవిద్యాలయం అకాడమిక్ డీన్ ప్రొ.రజనీకాంత్ శుక్ల మాట్లాడుతూ ప్రతి ఒక్కరు నైతిక బాధ్యత కలిగి చేసే ప్రతిపనిలో నిబద్ధత కలిగి ముందుకు వెళినట్లయితే అవినీతికి ఆస్కారమే లేదని తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా వక్తృత్వ, వ్యాసరచన చిత్రలేఖన పోటీలు నిర్వహించి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్స్ వెల్ఫేర్ డీన్ ప్రొ.ఎస్.దక్షిణామూర్తి శర్మ, చీఫ్-వార్డెన్ ప్రొ.పి.వెంకట్రావు, విజిలెన్స్ అవగాహన కోఆర్డినేటర్ ప్రొఫెసర్ సత్యనారాయణ ఆచార్య అడిషనల్ కోఆర్డినేటర్ డా. సీతారాం శర్మ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో విభిన్న విభాగాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# స్టార్ కృష్ణను మోసం చేసిన సుధాకర్ రెడ్డిపై కేసు నమోదు చేయాలి



**రేణిగుంట, మేజర్‌న్యూస్:** స్నేహం ముసుగులో విలువైన భూములను అంబేద్కర్ స్టార్ కృష్ణకి అంటగట్టడం మంచి పద్ధతి కాదని రేణిగుంట మండలం ఎస్సీ సెల్ టిడిపి మండల ప్రెసిడెంట్ పిల్లపాళెం శేషాద్రి మీడియా సమావేశం ద్వార తెలిపారు. వివరాల్లోకి వెళితే బహుజన నాయకుడు అయిన అంబేద్కర్ స్టార్ కృష్ణతో స్నేహంగా ఉంటూ మోసపూరితమైన ఆలోచనలతో ప్రభుత్వ మరియు తుడా రోడ్డులో వచ్చే స్థలాన్ని మోసపూరితంగా స్టార్ కృష్ణ భార్య కె.గురవమ్మకు, సుధాకర్ రెడ్డి కుమార్తె పి.పూజ ద్వారా అమ్మడం చేసి మోసం చేశాడని ఇది మంచి పద్ధతి కాదని మీడియా సమావేశంలో తెలిపారు. పానకం సుధాకర్ రెడ్డి చేసిన మోసాన్ని ప్రశ్నించినందుకు ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసి అసత్య న్యాయం జరిపించాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. అంతే కాకుండా సుధాకర్ రెడ్డి దంపతుల మోసాల చరిత్రను పోలీసులు లోతుగా పరిశీలిస్తే అనేక విషయాలు వెలుగులోనికి వస్తాయి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో సుబ్రమణ్యం, భరత్, పవన్, కళ్యాణ్, ఎన్. మురళి, మనోజ్, ఎం. గోపి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీలో పారిశుద్ధ్యం పనులు నిర్వహించాలి

**కార్వేటి నగరం, మేజర్‌న్యూస్:** మండలంలో ఉన్న ప్రతి మంగళవారం, ప్రతి శుక్రవారం, గ్రామ పంచాయతీలలో రెండు గ్రామాలు ఎంపిక చేసుకొని ఆ గ్రామాలలో సంపూర్ణ పారిశుధ్య పనులు నిర్వహించారని ఎంపీడీవో చంద్రమౌళి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపీడీవో కార్యాలయంలో పారిశుధ్యం పై సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంపిక చేసిన గ్రామాల్లో కచ్చితంగా పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ దగ్గర పారిశుధ్య పనులు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# పాము కాటుకు విద్యార్థి మృతి



**వాకాడు, మేజర్‌న్యూస్:** మండలంలోని బాలిరెడ్డి పాలెం గ్రామానికి చెందిన విద్యార్థి చరణ్ పాము కాటుకు గురై సకాలంలో వైద్యం అందక మృతి చెందాడు. చరణ్ ప్రస్తుతం బాలిరెడ్డిపాలెం గ్రామంలో ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. స్కూల్‌కి వెళ్లి వచ్చి తన ఇంట్లోనే రాత్రి పూట నిద్రిస్తుండగా రాత్రి 12 గంటల సమయంలో కళ్ళు కనిపించడం లేదని, కాలు నొప్పిగా ఉందని తల్లిదండ్రులకు చెప్పడంతో చరణ్‌ను బాలిరెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లగా ఆ ఆస్పత్రి లో వైద్యాధికారి లేకపోవడంతో వాకాడు ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువచ్చి చికిత్స అందించారు. మెరుగైన వైద్యం కోసం గూడూరు ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్తుండగా సోమవారం ఉదయం మృతి చెందాడు. దీంతో ఆ కుటుంబం కన్నీరు మున్నీరు అయ్యింది. వాకాడు పోలీసులు కేసు నమోదు చేసి పోస్టుమార్టం చేసి తల్లిదండ్రులకు అప్పగించారు. బాలిరెడ్డిపాలెం గ్రామం శోక సముద్రంలో మునిగిపోయింది.

# ప్రతి రైతుకి పెట్టుబడి సాయం అందించాలి



**గూడూరు మేజర్‌న్యూస్:** ప్రతి రైతుకి పెట్టుబడి సాయం అందించాలని గూడూరు సీపీఐ నియోజక వర్గ కార్యదర్శి జి శశి కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు సచివాలయంలో సీపీఐ నాయకులు రైతులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు శశి కుమార్ మాట్లాడుతూ 2024 వ సంవత్సరం లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే పెట్టుబడి సాయం 20 వేల రూపాయలు అందిస్తామని హామీ ఇచ్చారు అని అది ఇప్పటివరకు అమలు చేయలేదని పేర్కొన్నారు. గత ప్రభుత్వ విధానాల వలన రాష్ట్రంలో ప్రతి రైతుపై 2 లక్షల 45 వేల రూపాయలు రుణం ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లో రాయలసీమ జిల్లాల్లో కరువు పరిస్థితి, కోస్తా తీరప్రాంతాల్లో భారీ వర్షాలు వరదలు ముంచెత్తాయి అన్నారు. రైతులు తీవ్రంగా నష్టపోయారని తెలిపారు. ఖరీఫ్ సీజన్లో 12 లక్షల ఎకరాల్లో రైతులు పంటలు వేయలేకపోయారన్నారు. ప్రస్తుతం రబీ సీజన్ ప్రారంభమైందని రైతులుకు ప్రకటించిన పెట్టుబడి సాయాన్ని అందించాలన్నారు. రాష్ట్రంలో సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం గత ఐదు ఏళ్లుగా అటకెక్కిందని, పోలవరం ప్రాజెక్టుకు నిధులు మంజూరుకు కూటమి ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. ప్రస్తుతం రబీ సీజన్ లో రైతాంగం సాగు చేస్తున్న పంటలు అన్నింటికీ రాష్ట్ర ప్రభుత్వం పంటలు భీమా సొమ్మును ప్రభుత్వమే భరించి రైతాంగాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి కాలేషా, ఏఐటియుసి నియోజకవర్గ కార్యదర్శి చంద్రయ్య, బికెఎంయు అధ్యక్షులు అంకయ్య, ప్రజా నాట్య మండలి జిల్లా నాయకులు మస్తా నయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మండల సమస్యలపై మండలాధ్యక్షుడు చర్చ



**పుంగనూరు, మేజర్‌న్యూస్:** మండలంలోని సమస్యలపై ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం కార్యకర్తలతో టిడిపి మండల అధ్యక్షుడుమాధవరెడ్డి చర్చించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు, సిసి రోడ్లు, వాటర్ పైప్ లైన్ సమస్యలు, ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు.

# సమాచార హక్కు చట్టంపై అధికారులకు అవగాహన




**గుడుపల్లి, మేజర్‌న్యూస్:** రాష్ట్ర సమాచార కమిషనర్, చిత్తూరు జిల్లా వ్యవసాయ అధికారి ఆదేశానుసారం గుడుపల్లి మండలంలో సమాచార హక్కు చట్టం -2005పై గ్రామ స్థాయి అధికారులకు, సిబ్బందికి, ప్రజాప్రతినిధులకు, ప్రజలకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ద్వారా తమకు కావలసిన సమాచారాన్ని పొందాలని తెలియజేశారు సమాచార హక్కు అనగా ఏ అధికార యంత్రాంగం నియంత్రణ కింద ఉన్న ఏ సమాచారాన్ని అయినా ఈ చట్టం కింద పొందగలిగే హక్కు అని, ఉదాహరణకు పనులను పత్రాలను తనిఖీ చేసే హక్కు రికార్డులలో ఉన్న సమాచారాన్ని ఎత్తు రాసుకోవడం, వాటి నకలు, సర్టిఫైడ్ కాపీలను తీసుకోవటం సమాచార సంపత్తి, సర్టిఫైడ్ సాంపిళ్ళు తీసుకోవటం, ఫ్లాపీలు, డిస్కులు, టేపులు, వీడియో క్యాసెట్ రూపంలో మరేదైనా ఎలక్ట్రానిక్ రూపంలో ఉన్న సమాచారాన్ని పొందవచ్చని, సమాచారం కంప్యూటర్లో గాని మరి ఏదైనా పరికరంలో ఉంటే ప్రింట్ అవుట్ ద్వారా దానిని ప్రజలకు అందించాలన్నారు. అధికార యంత్రాంగంలో పారదర్శకత, జవాబుదారితనం తీసుకురావడం, అవినీతిని అరికట్టటం, ప్రభుత్వం వాటి విభాగాలు ప్రజలకు జవాబుదారీగా ఉండటం, సమాచారంలో పారదర్శకత ఉండాలని, ప్రభుత్వ కార్యక్రమాలు సమర్థవంతంగా నిర్వహించటం, పరిమిత ద్రవ్యవనరులను సమర్థవంతంగా వినియోగించటం ఈ చట్టం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు, సమాచార హక్కు చట్టంలో ముఖ్యమైన మూడు నుండి పది సెక్షన్లు, 18 నుండి 20 సెక్షన్ల గురించి అందరూ పౌరులు తెలుసుకొని ఉండాలని, వాటిపట్ల అవగాహన ఉండాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థాయి అధికారులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యం - ఎంపీటీసీ రఘురాం రాజు

**ఓజిలి, మేజర్‌న్యూస్:** ఆకులు, అలముల కషాయాలతో తయారు చేసిన ఎరువులు, పురుగు మందులతో పండించిన కూరగాయలు ఆరోగ్యవంతంగా ఉంటాయని ఆరిమేను పాడు ఎంపీటీసీ సభ్యులు గుంట మడుగు రఘురాం రాజుసూచించారు. స్థానిక మండల పరిషత్



కార్యాలయం వద్ద మండలంలోని వివిధ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయంపై సాగు చేసి పండించిన కూరగాయలను ప్రకృతి వ్యవసాయం సిబ్బందితో కలిసి అధికారులకు, ప్రజాప్రతినిధులకు, సోమవారం విక్రయించారు. 20 లీటర్ల బీజామృతం రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రసాయన ఎరువులు, పురుగు మందులతో పండించే కూరగాయలు, పంటలతో అనేక రకాల వ్యాధులు వస్తాయని అన్నారు. ఇలాంటి పరిస్థితిలో ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలు ఎంతో ఆరోగ్య వంతంగా ఉంటాయని అన్నారు. ప్రతి ఒక్కరు ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఐసిఆర్పీలుబి.గురవయ్య ,టిగురవయ్య ,మాధురి, రేవతి, సిద్ధమ్మ, మహేశ్వరమ్మ ,సాయిప్రియ,సుమతి, చంచులక్ష్మి, ప్రశాంతి, షబ్న, ఉమ సీనియర్ సిటిజన్, రఘురామరాజు, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శరీర ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ప్రతి వారికి అవసరం



**దొరవారిసత్రం, మేజర్‌న్యూస్ :** ప్రతి వ్యక్తికి శారీరక ఆరోగ్యంతో పాటు, మానసికమైన ఆరోగ్యం అవసరమని సైకాలజిస్ట్ రేవతి సూచించారు.సోమవారం ఆమె మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయం కళాశాలలో మానసిక వత్తిడి అధికమించడం -మానసిక ఆరోగ్యం అనే అంశాలపై విద్యార్థినిలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థిని వారి దినచర్యలు అకాలంగా మార్పులు రావడం,కారణం లేకుండాచికాకు,కోపం,వంటి ఉద్రేకాలకు లోను కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి విద్యార్థి దిగాలుగా ఉండటం, చికాకు, భయం వంటి వాటికి గురికాకుండా జాగ్రత్తలు పాటించి,మానసికమైన ఒత్తిడిలను అధిగమించాలని వెల్లడించారు. రోజువారి జీవన విధానంలో ఇతరులపై ఈర్ష పెంచుకోకూడదు, పగలు ప్రతీకారాలు సాధించాలని మనసును ఉద్రేకానికి లోను కాకుండా ధ్యానం వంటి వాటిని అవలంబించి మానసిక ఆరోగ్యం మెరుగుపరుచుకోవాలని తెలియపరిచారు. ప్రధానంగా పరీక్షలకు సిద్ధమవుతున్న పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు మెదడుకు అధిక వత్తిడి, అమితమైన ఆలోచనలు వంటి వాటిని దూరంగా పెట్టి ఏకాగ్రతతో ఉత్తీర్ణత కావడానికి ప్రయత్నించాలన్నారు. ప్రతి ఒక్కరూ శారీరక పరిశుభ్రత పాటిస్తూ, మానసిక ఆరోగ్యానికి 8 గంటలు గాఢ నిద్ర పొందాలని వారికి తెలిపారు. శారీరక,మానసిక,సామాజికంగా అన్నింటిని మన అదుపులో ఉంచుకుంటే సంపూర్ణ ఆరోగ్యం సాధించిన వారవుతారన్నారు.ప్రతి విద్యార్థి పగలు, ప్రతీకారాలు,ఈర్షలు, కోపాలు,వంటి వాటికి దూరంగా ఉండాలని,పలు రకాల ఆలోచనలతో మానసిక ఒత్తిడిలకు గురికాకుండా మనసును అదుపులోకి చేసుకోవాలనిఆమె వివరించారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పార్వతి,ఎంఎల్ హెచ్ పి మౌనిక,హెల్త్ అసిస్టెంట్ సుధాకర్,ఏఎన్ఎం డోరతి, శ్రావణి,ఆశ మంజుల పాల్గొన్నారు.

# బత్తిన మస్తాన్ రెడ్డిని పరామర్శించిన తెదేపా నాయకులు

**నాయుడుపేట రూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని అన్నమేడు గ్రామం టిడిపి ప్రెసిడెంట్ టిడిపి సీనియర్ నాయకులు బత్తిన మస్తాన్ రెడ్డి (బుజ్జి రెడ్డి)కి ఇటీవల వెన్నుపూస ఆపరేషన్ చేయడంతో బుజ్జి రెడ్డిని పరామర్శించిన తిరపతి పార్లమెంటు ఆర్గనైజేషన్ సెక్రటరీ దార్ల రాజేంద్ర మాట్లాడుతూ మీరు త్వరగా కోలుకోవాలి తెలుగుదేశం పార్టీకి మీ సేవలో మళ్లీ అందించాలి దేవుణ్ణి ప్రార్థిస్తున్నాను వారితోపాటు నాయుడుపేట మండలం మాజీ ఎక్స్ వైస్ మండల ప్రెసిడెంట్, రవివర్మ,మండల బిజెపి అధ్యక్షులు పట్టుకోట రవి, అన్నమేడు టిడిపి నాయకులు బల్లి తిరుపాల్, కొవ్వూరు సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొని ఆరోగ్య యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.



# వివాహిత ఆత్మహత్యాయత్నం



**పుంగనూరు, మేజర్ న్యూస్:** మండల పరిధి లోని పత్రపల్లె పంచాయతీ పత్రపల్లి గ్రామంలో కుటుంబ కలహాలతో సోమవారం వివాహిత ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించింది. వివరాల్లోకెళ్తే గ్రామానికి చెందిన రాజ భార్య రాధా(35) కుటుంబ కలహాలతో వ్యవసాయ పొలంలో వాడే పురుగుల మందును తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

## శ్రీకాళహస్తీశ్వరుడు సేవలో మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్ :** మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు కార్తీక సోమవారం సందర్భంగా శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం వాయు లింగేశ్వరుణ్ణి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం అధికారులు ఆయనకు ఘన స్వాగతం పలికి. ప్రత్యేక దర్శనం చేయించారు. అనంతరం ఎస్సీ వి నాయుడుని కండువాతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ కార్తీక సోమవారం వాయులింగేశ్వరుడు అయిన పరమశివుణ్ణి దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు. ప్రజలు, భక్తులందరూ ఆ వాయులింగేశ్వరుణ్ణి దర్శించుకుని, ఆయన ఆశీస్సులు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో గోగినేని భాస్కర్ నాయుడు. వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



**పెళ్లకూరు, మేజర్‌న్యూస్:** రానున్న రబీ సీసన్లో విత్తనాలను రైతులకు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని మండల వ్యవసాయ శాఖ అధికారి జి.ప్రవీణా మండలంలో ఉన్న డీలర్లను హెచ్చరించారు. సోమవారం మండల పరిధిలోని నెలబల్లి,శిరసనంబేడు రాజు పాలెం, చెంబేడులో ఉన్న పలు ఫర్టిలైజర్, సీడ్స్, పెస్టిసైడ్ డీలర్ దుకాణలను వారు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏవో ప్రవీణా మాట్లాడుతూ విత్తనాలు, ఎరువుల ధరల పట్టికను ఏర్పాటు చేయాలని సూచించారు. రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులు, పురుగు మందులకు రసీదులు తప్పని సరిగా ఇవ్వాలని సూచించారు.రైతులకు రబీ సీజన్లో వ్యవసాయ పనుల్లో ఏమైనా సమస్యలు ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకొని రావాలని తెలిచేశారు.

## మండలంలో భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యం



**తొట్టంబేడు, మేజర్‌న్యూస్:** మండలంలో భూ సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రీ సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తొట్టంబేడు తహసీల్దారు యు మధుసూదనరావు చెప్పారు. తొట్టంబేడు మండలం కంచన పల్లెలో సోమవారం రీ సర్వే గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలకు సంబంధించిన వినతులను ప్రజల నుంచి ఆయన తీసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఈ సమస్యలు వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని ఆయన హామీ ఇచ్చారు. ఇక గ్రామ సభలు ప్రాధాన్యత. లక్ష్యం గురించి ప్రజలకు ఆయన వివరించారు. ఈ కార్యక్ర మంలో డిప్యూటీ ఇన్స్ పెక్టరు ఆఫ్ సర్వే రాఘవయ్య, మండల సర్వేయరు హరినాథ్. కం చనపల్లి వీఆర్వోలు. సంధ్య. సచివాలయ సర్వేయర్లు విజయ లోకేష్, సుకన్య. అంజలి. సూర్య. మహేష్, సుబ్రహ్మణ్యం. కమ్యూనిటీ సర్వేయరు. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## అకస్మాత్తుగా వ్యక్తి మృతి



**నగరి, మేజర్‌న్యూస్:** మండలంలోని పాండురాజుపురం జగనన్న కాలనీలో ఉండే లేట్ కృష్ణంరాజు కుమారుడు ఎస్.కె గోవర్ధన్ అలియాస్ నాగరాజ్ వయసు 44 సంవత్సరాలు ఇతను నిన్న మధ్యాహ్నం మద్యం సేవించి పిసిఆర్ జూనియర్ కాలేజీ కాంపౌండ్ వెలుపల ఉండగా అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో అక్కడికక్కడే కిందపడి చనిపోవడం జరిగింది దాన్ని చూసిన స్థానికులు నిన్న సాయంత్రం పోలీస్ వారికి తెలియజేసారు. వెంటనే పోలీస్ వారు ఘటన స్థలానికి చేరుకొని సోమవారం కేసు నమోదు చేసి దానిపైన దర్యాప్తు చేసి బాడిని పోస్టుమార్టం పంపడమైనది.

## శ్రీకొండ మల్లీ శ్వర స్వామికి పాలాభిషేకం



**వెదురుకుప్పం, మేజర్‌న్యూస్:** మండలంలోని మాంబేడు పంచాయితీ డిఆర్ అండ్ కండ్రిగ సమీపంలోని అరుణగిరి క్షేత్రంలో వెలసి ఉన్న శ్రీ జ్ఞాన ప్రసూనాంబ సమేత శ్రీ కొండ మల్లీ శ్వర స్వామికి సోమవారం పాలాభిషేకం స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. స్వామివారికి అభిషేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం అక్కడే ఉన్న పంచముఖ ఆంజనేయస్వామిని భక్తులు దర్శిం చుకున్నారు. కార్యనిర్వహులు భక్తులకు తీర్థప్రసాదాలు అంద జేశారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. అన్నమయ్య కీర్తనలతో భక్తులను అలరింపజేశారు.

## కాలం చెల్లిన మహావృక్షాలను తొలగించండి



**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్ న్యూస్:** తిరుమలలో కాలం చెల్లిన మహా వృక్షాలను తొలగించి భక్తుల ప్రాణాలకు భద్రత కల్పించాలని, శ్రీవారి భక్తుల భద్రత విషయంలో చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా కాకుండా టిటిడి అటవీశాఖ అధికారులు సత్వర చర్యలు చేపట్టాలని బిజెపి నేత నవీన్ కుమార్ రెడ్డి డిమాండ్ చేశారు. తిరుమలలో రెండు మహావృక్షాలు విరిగి కారులపై పడి ధ్వంసం రావడంపై స్పందించి సోమవారం ఆయన కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. శ్రీవారి అనుగ్రహంతో భక్తులకు ఎటువంటి ప్రాణహాని కలగలేదన్నారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని కొండపై కాలం చెల్లిన పెద్ద వృక్షాలు విరిగి భక్తులు వాహనాలపై పడి ప్రాణం నష్టం జరగకముందే ముందస్తు చర్యల్లో భాగంగా వాటిని టిటిడి ఫారెస్ట్ అధికారులు యుద్ధ ప్రాతిపదికను తొలగించాలని డిమాండ్ చేశారు. టిటిడి ఫారెస్ట్ అధికారులు టిటిడి నిబంధనలకు లోబడి కాలం చెల్లిన మహా వృక్షాలను తొలగించే కాంట్రాక్టు పనులను అన్యమతస్తులకు టెండర్ లో పాల్గొనే అవకాశం ఇవ్వరాదన్నారు. ఇటీవల గోవిందరాజ స్వామి ఆలయ ప్రాంగణంలో మహావృక్షం విరిగిపడి ప్రాణం నష్టం జరిగిందని, జాపాలి ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో కొమ్మ విరిగి భక్తులపై పడి గాయాలయ్యాయని, అలాంటి సంఘటనలు పునరావతం కాకుండా టిటిడి అనుబంధ ఆలయాల ప్రాంగణాలలో కాలం చెల్లిన మహావృక్షాలను వెంటనే తొలగించాలన్నారు.

## నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవు

### - హెల్త్ అధికారి డాక్టర్ యువ అన్వేష్

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** నగరంలోని హోటల్ యాజమాన్యాలు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని నగర పలక సంస్థ హెల్త్ అధికారి డాక్టర్ యువఅన్వేష్ హెచ్చరించారు. స్పైసీ పారడైస్ హోటల్లో బిర్యానీలో బొద్దింక వచ్చినది ఫిర్యాదు పై స్పందించిన కమిషనర్ ఎన్ మౌర్య తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. కమిషనర్ ఆదేశాల మేరకు సోమవారం నగరపాలక సంస్థ ఆరోగ్య అధికారి డాక్టర్ యువ అన్వేష్, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటితో కలిసి ఈస్ట్ పోలీస్ స్టేషన్ సమీపంలోని హోటల్ స్పైసీ పేరడైస్ ను తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా నగరపాలక సంస్థ ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ అన్వేష్ మాట్లాడుతూ స్పైసి ప్యారడైజ్ హోటల్ పై



వచ్చిన ఫిర్యాదుల మేరకు తనిఖీ చేసి తాత్కాలికంగా మూసివేసామన్నారు. తనిఖీల్లో హోటల్లో అపరిశుభ్రంగా ఉండడం, స్టాక్ వద్ద భారీ సంఖ్యలో బొద్దింకలు ఉండడంతో సేఫ్టీ నమూనాలు పాటించలేదని గుర్తించామన్నారు. ఆ మేరకు ప్రతినెలా పెస్ట్ కంట్రోల్ చర్యలు చేపట్టాలని, గోడలు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, కిచెన్ నందు మూతలు కలిగిన పాత్రలు వాడాలని సూచించామన్నారు. డస్ట్ బిన్లు ఏర్పాటు చేసుకోవాలని, కోల్డ్ స్టోరేజ్ సరైన పద్ధతిలో అమలు చేయాలని, వంట మనుషులు, పనిచేయువారు ఎలాంటి అంటూ వ్యాధులు లేకుండా ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించి సర్టిఫికెట్లు పొందాలని పొందాలని సూచించమన్నారు. స్టాకు కొన్నప్పుడు, వినియోగించినప్పుడు స్టాక్ రిజిస్టర్ మైంటైన్ చేయాలని నగరపాలక సంస్థ లైసెన్సులు ఫుడ్ లైసెన్సులు కనపడే విధంగా ఉంచాలని తెలిపారు. వినియోదారులకు నాణ్యమైన ఫుడ్ అందించాలని, నిబంధనలు పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లా ఫుడ్ సేఫ్టీ ఆఫీసర్ హోటల్లో తీసిన ఆహార పదార్థాలు శాంపుల్స్ హైదరాబాదు ల్యాబ్ కి పంపామని, మూడు వారాల లోపల రిపోర్ట్స్ వస్తాయన్నారు. తనిఖీలు కనుగొన్న లోపాలను సరిదిద్దుకోవాల్సిందిగా నోటీసులు ఇచ్చామన్నారు. వారు హోటల్ నందు తనిఖీల్లో తెలిపిన లోపాలను సరిదిద్ది తిరిగి తెరుచుకునేందుకు అనుమతి ఇస్తామని హెల్త్ ఆఫీసర్ తెలిపారు. ఈ తనిఖీల్లో శానిటరీ సూపర్ వైజర్స్ చెంచయ్య, సుమతీ ఉన్నారు.

## ప్రతి రైతుకు రూ.20వేలు పెట్టుబడి సహాయం అందిస్తామని ప్రకటించారు



**పలమనేరు, మేజర్‌న్యూస్:** 2024 ఎన్నికల సందర్భంగా కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే ప్రతి రైతుకు రూ 20, 000 పెట్టుబడి సహాయం అందిస్తామని ప్రకటించారు. గత ప్రభుత్వ విధానాల వలనమన రాష్ట్రంలో ప్రతి రైతు కుటుంబం పై 2 లక్షల 45వేలు రూపాయల రుణం ఉన్నది. ప్రస్తుత ఖరీఫ్ సీజన్లోరాయలసీమ జిల్లాలో కరువు పరిస్థితిమరో పక్క కోస్తా తీరా ప్రాంతాలలో జిల్లాలలో భారీ వర్షాలు వరదలు ముంచెత్తాయి. రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఖరీఫ్ సీజన్లో సుమారు 12 లక్షల ఎకరాల్లో రైతాంగం పంటలు వేయలేకపోయారు. ప్రస్తుతం ఖరీఫ్ సీజన్ ముగిసింది రబీ సీజన్ ప్రారంభమై రైతులు పెట్టుబడి కోసం ఎదురుచూస్తున్న దశలో మీరు ప్రకటించిన రైతుకు 20 వేల రూపాయల పెట్టుబడి సహాయం ఇచ్చిఆదుకోవాలన్నారు. రాష్ట్రంలోసాగునీటిప్రాజెక్టుల నిర్మాణంగత ఐదు సంవత్సరాలుగా అటకెక్కింది. ఈ దశలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణానికి నిధులు మంజూరుకు మీరు చేస్తున్న కృషి అభినందనీయం. అలాగే వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర రాయలసీమ జిల్లాలతో పాటు రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి అవసరమైన నిధులు రాబోయే బడ్జెట్లలో కేటాయించి సాగునీటి రంగ అభివృద్ధికిసహాయం చేయగలరు. ఉక్కుతోపాటు రైతులకు అవసరమైన పుష్కర యూరియా అమోనియం సల్ఫేట్ క్రూడ్ ఆయిల్ కోల్తార్ వాష్ ఆయిల్ గ్యాస్ ఆంధ్ర సీన్ ఆయిల్ హెవీ క్రోడ్ బెంజాల్ తదితర 20 ఉత్పత్తులను ఉక్కు ఫ్యాక్టరీ అందిస్తూ దేశ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని రైతు సంఘం నాయకుడు ఉమాపతి నాయుడు సోమవారం రూరల్ మండలంలోని తింగరగుంట పంచాయతీ సెక్రెటరీకి వినతిపత్రాన్ని అందించారు. ఈ విషయం ప్రభుత్వందృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాలన్నారు.

## విలేఖరి శ్రీనివాసులు రెడ్డిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య



**తడ, మేజర్ న్యూస్:** తడ మండల వార్త రిపోర్టర్ సీనియర్ జర్నలిస్ట్ పర్వత రెడ్డి శ్రీనివాసులు రెడ్డి అనారోగ్య కారణం చేత చెన్నైలోని విజయ హాస్పిటల్ నందు చికిత్స పొందారు. ఇటీవల వారి స్వగ్రామమైన గోపాల్ రెడ్డి పాలెంకు రావడంతో విషయం తెలుకున్న మాజీ సూళ్లూరుపేట శాసనసభ్యులు కిలివేటి సంజీవయ్య సోమవారం వారి ఇంటి వద్దకు వెళ్లి వారిని పరామర్శించారు. సంజీవయ్యతో పాటు మాజీ డిసిఎంఎస్ డైరెక్టర్ జెట్టి వేణు యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ చిన్ని సత్యనారాయణ, కౌన్సిలర్ మీజూరు రామకృష్ణారెడ్డి, వైసీపీ నేతలు అయిత శ్రీధర్, అలవల సురేష్, వాకాటి బాబు రెడ్డి, ఆర్ముగం, రమేష్, తడకండ్రిగ రమేష్ తదితర నాయకులు వున్నారు.

## మండల పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం



**శాంతిపురం, మేజర్ న్యూస్:** రామకుప్పం మండలఎంపిపి సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశంలో రామకుప్పం మండలానికి సంబంధించిన సమస్యలు, పరిష్కార మార్గాలు, మండలంలో జరుగుతున్న అభివృద్ధికి సంబంధించిన అంశాలపై అధికారులతో సమీక్షించిన ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ , చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు. ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ కుప్పం నియోజకవర్గ ఇన్చార్జ్ ముని రత్నం మండలంలో త్రాగనీరు డ్రైనేజ్ సిసి రోడ్లు తదితర అంశాలపై చర్చించి జిల్లా అధికారులకు నివేదిక పంపుతామని నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి నితిన్ రాఘవరెడ్డి డాక్టర్ సురేష్ బాబు రెడ్డి ఎంపీడీవో తాసిల్దార్ అన్ని శాఖల అధికారులు నాయకులు పాల్గొన్నారు.

# నగరంలో రోడ్లపై ఎక్కడా గుంతలు ఉండకూడదు : కమిషనర్



**తిరుపతి బ్యూరో, మేజర్‌న్యూస్:** తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ప్రధాన వీధులు, చిన్న వీధుల్లో ఎక్కడా గుంతలు లేకుండా పూడ్చాలని కమిషనర్ ఎన్.మౌర్య ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. నగరంలో రోడ్లపై గుంతలు పూడ్చడం, గత వారం ప్రజల నుండి వచ్చిన వినతుల పరిష్కారం, పారిశుద్ధ్య నిర్వహణ తదితర అంశాలపై నగరపాలక సంస్థ కార్యాలయంలో అన్ని విభాగాల అధికారులతో సోమవారం కమిషనర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. కమిషనర్ మాట్లాడుతూ ఈ నెల 15 లోపు నగరంలో అన్ని వీధుల్లో గుంతలు లేకుండా పూడ్చేందుకు యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అలాగే పలుచోట్ల ఇంజనీరింగ్ పనులు ఆలస్యంగా జరుగుతున్నాయని, పనులు వేగవంతం చేయాలని అన్నారు. ప్రతి సోమవారం ప్రజల నుండి వచ్చిన వినతులను ఏ మేరకు పరిష్కరించారని తెలుసు కుని, ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. అలాగే నగరంలో పారిశుద్ధ్య పనులు మరింత బాగా చేపట్ట లని అన్నారు. పెండింగ్ పన్నులు వసూళ్ల త్వరగా పూర్తి చేయాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. నగరంలో అనధికారిక లేఅవుట్లు, భవన నిర్మాణాలు పరిశీలించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కమిషనర్ చరణ్ తేజ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజనీర్లు తులసి కుమార్, గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవెన్యూ ఆఫీసర్స్ సేతుమాధవ్, రవి, డిసిపి మాహాపతి, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర, ఉద్యానవన శాఖ అధికారి హరికృష్ణ, ఫైర్ ఆఫీసర్ శ్రీనివాసులు, మేనేజర్ హాసీమ్, డి.ఈ.లు, సూపరింటెండెంట్లు, ఏసిపి లు, శానిటరీ సూపర్ వైజర్లు, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ భూమి ఆక్రమణ దారులపై చర్యలు తీసుకోవాలి

**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** గూడూరు డివిజన్ చిట్టమూరు మండలం పిట్టివానిపల్లి గ్రామంలో ప్రభుత్వ భూముల ఆక్రమణ చేస్తున్న ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనబాక కోటేశ్వరరావు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా చేసి అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో బిజెపి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ గూడూరు డివిజన్ చిట్టమూరు మండలం రంగనాథపురం పంచాయతీ పిట్టివానిపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 1-1లో 12 ఎకరాల 30సెంట్లు సర్వే నంబరు 36లో ఎనిమిది ఎకరాలు సర్వేనెంబర్ 41లో 13 ఎకరాల భూమి పిట్టివాని పల్లి గ్రామంలోని పదిమంది రైతులకు సుమారు రెండు ఎకరాలు చొప్పున 1970లో ప్రభుత్వము అసైన్మెంట్ పట్టాలిచ్చారు. అదే భూమిని 1992లో వాకాడు మండలం రైతులకు అసైన్మెంట్ పట్టాలిచ్చారు. ఈ రెండు గ్రామాల రైతులు తమవే, తమవే అంటూ చిట్టమూరు మండల తాసిల్దార్ కార్యాలయము, గూడూరు ఆర్డీవో కార్యాలయము, నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్ కార్యాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేసి నష్టపోయారు. ఇది ఇలా ఉండగా పిట్ట వానిపల్లి భూస్వాములు తేరువాయి మణి తేరువాయి చిరంజీవి, తేరువాయి చంద్రయ్య, తేరువాయి తిరుపాలు, మంజుల, మధు, అనేవారులు వారి బంధువుల పేర్లతో గత వైసిపి ప్రభుత్వంలో ప్రభుత్వనాయకుల, అధికారులు అండదండలతో పాసుబుక్కులు చేయించుకొని గతంలో అసైన్మెంట్ పట్టాలు పొందిన రైతులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు ఇప్పటికైనా అధికారులు స్పందించి ఈ భూములపై సమగ్ర విచారణ జరిపి అర్హులైన వారికి అసైన్మెంట్ పట్టాలి ఇప్పించాలని డిమాండ్ చేశారు ఇంతే కాకుండా 100 ఎకరాల భూమిని ఇతర గ్రామాల నుండి భూస్వాములు ఆక్రమించుకొని ఆక్వా సాగు చేసుకునేవారు. ఆక్వా సాగును రద్దు చేస్తూ కోర్టు ఉత్తర్వులు ఉన్నందున ఖాళీగా ఉన్న భూమిని పిట్టివానిపల్లి గ్రామంలోని పేద కుటుంబాలకు పట్టాలు ఇప్పించి సాగు చేసుకునే విధంగా కల్పించాలని బిజెపి నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో గూడూరు అర్బన్ మండల పార్టీ అధ్యక్షులు బాలకృష్ణ నాయుడు, రాష్ట్ర యువమోర్చా నాయకులు కే దయాకర్, గూడూరు పట్టణ ప్రధాన కార్యదర్శి గుంజి శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలి

### గ్రీవెన్స్‌లో గూడూరు ఆర్డీఓకి వనబాక కోటేశ్వరరావు వినతి

**చిట్టమూరు, మేజర్‌న్యూస్:** చిట్టమూరు మండలం రంగనాథపురం (పిట్టివానిపల్లి) రెవెన్యూలో ఆక్రమణలో ఉన్న ప్రభుత్వ భూములను పేదలకు పంచాలని సోమవారం గూడూరు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకు భాజపా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వనబాక కోటేశ్వరరావు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించినట్లు ఓ ప్రకటనలో తెలియజేశారు. గ్రామానికి చెందిన భూస్వాములు గుప్పెట్లో 100ఎకరాలకు పైగా భూములు ఆక్రమణలో ఉన్నాయని వెంటనే ప్రభుత్వం సర్వే నిర్వహించి పేదలకు పంపిణీ చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్ర మంలో బిజెపీ గూడూరు మండల అధ్యక్షులు బాలకృష్ణనాయుడు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, యువమోర్చ నాయకులు దయాకర్, చిట్టమూరు మండలం ప్రధాన కార్యదర్శి పర్రి రమణయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు చెంచురెడ్డిలు పాల్గొన్నారు.






## కలెక్టర్‌ను కలిసిన ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తిరుపతి ప్రెస్‌క్లబ్ కు నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్‌ను కలిశారు. సోమ వారం జిల్లా కలెక్టర్‌ను ఆయన కార్యాలయంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు మురళి, ప్రధాన కార్యదర్శి బాల చంద్ర, కోశాధికారి చంద్రబాబుతో పాటు ఉపాధ్యక్షు లు ప్రకాష్ బాబు, జాయింట్ సెక్రెటరీ మాధవ్, ఈసీ మెంబర్లు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చులు అందించారు. ప్రెస్‌క్లబ్ నిర్వహణ వ్యవహారాలను, ప్రెస్‌క్లబ్ ఎన్నికల నిర్వహణను అడిగి తెలుసుకున్నా రు. అనంతరం ప్రెస్‌క్లబ్ సొంత భవనంలేని విషయా న్ని కమిటీ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరలోనే స్థల పరిశీలన అంశాన్ని పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

# బ్రెస్ట్ క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించాలి : జాయింట్ కలెక్టర్ విద్యాధరి

**చిత్తూరు కలెక్టరేట్, మేజర్‌న్యూస్:**

మహిళల్లో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ మార్గాల పై అవగాహన ఎంతో ముఖ్యమని జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి పేర్కొన్నారు. చిత్తూరు కలెక్టరేట్ లోని నూతన సమావేశపు మందిరం నందు సోమ వారం ఇంటర్నేషనల్ సెక్రటరీ ఇరుదు స్వామి సారధ్యంలోని కాన్సోరియమ్ ఆఫ్ హెల్త్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టర్ జి. విద్యాధరి మాట్లాడుతూ కాన్సోరియమ్ ఆఫ్ హెల్త్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా సంస్థ పరివర్తన స్వచ్ఛంద సేవా సంస్థ జిల్లా వ్యాప్తంగా మహిళ ల్లో బ్రెస్ట్ క్యాన్సర్ నివారణ మార్గాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమనన్నారు. బ్రెస్ట్ క్యాన్సర్ లక్షణాలు స్వీయ పరీక్ష చేసుకొని దగ్గరలో ఉన్న ప్రభుత్వ హాస్పిటల్‌లో ఉచిత పరీక్షల కోసం కచ్చితంగా సంప్రదించి చికిత్స పొందాలని అలాగే ప్రతి ఒక్కరూ తమ కుటుంబాలను మహిళల ఆరోగ్య సంరక్షణ కోసం ఆరోగ్య బ్రెస్ట్ క్యాన్సర్ హెల్ప్ యాప్ డౌన్లోడ్ చేసుకుని తద్వారా మరింత అవగాహన పొందాలనన్నారు. కాన్సోరియం ఆఫ్ హెల్త్ అసోసియేషన్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా తొమ్మిది దేశాలలో మహిళ ల్లో ఏర్పడు తున్నటు వంటి బ్రెస్ట్ క్యాన్సర్ వ్యాధి యొక్క ఆవశ్యకత వివరిస్తూ, నివారణ మార్గాలు తెలియ పరుస్తూ పోస్టర్లు, పవర్ పాయింట్ ప్రజెంటేషన్, కరపత్రా లు అందజేయడం జరుగుతుందని, ఆంధ్రప్రదేశ్‌లో అన్ని జిల్లాలలో ట్రెనింగ్ ఆఫ్ ది ట్రైనర్ అనే కార్యక్రమాన్ని మొదట గా నవంబర్ 9వ తేదీ తిరుపతి యూత్ హాస్టల్‌లో జోనల్ వారీగా నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమంలో మహిళలు ఎక్కువ మంది పాల్గొనేలా అవగాహన కల్పి స్తున్నామని జాయింట్ కలెక్టర్‌కు సంస్థ ప్రతినిధి అమర్నాథ్ వివరించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డిఎం అండ్ హెచ్‌ఓ డా.ప్రభావతి, ఐసిడిఎస్ పిడి హేమావతి సంబంధిత అధికారులు స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.




## విలేకరులు కావలెను

నేటి దినపత్రిక సూర్యలో తిరుపతి జిల్లాలోని కింది మండలాల్లో పనిచేయుటకు ఉత్సాహవంతులైన, యువకులు విలేకరులుగా కావలెను.

**చంద్రగిరి నియోజకవర్గం :**
1.చంద్రగిరి, 2.పాకాల, 3.చిన్న గొట్టికల్లు, 4.ఎర్రవారి పాలెం

**వెంకటగిరి నియోజకవర్గం :**
1. బాలాయపల్లి

**సత్యవేడు నియోజకవర్గం :**
1.సత్యవేడు, 2. బి.ఎన్.కండ్రిగ, 3. నాగలాపురం, 4. పిచ్చాటూరు, 5. నారాయణవనం

కె.సురేష్‌బాబు (బ్రాంచ్ మేనేజర్) ఫోన్ నెంబర్: 9346318232

ఎన్.లక్ష్మీనారాయణ (రీజనల్ మేనేజర్) ఫోన్ నెంబర్: 6301107116

# ఉపాధి కూలీలకు పని కల్పించాలి



**గూడూరు రూరల్, మేజర్‌న్యూస్:** డివిజన్‌లోని అన్ని గ్రామాల్లో ఉపాధి కూలీలకు వందరోజుల పని కల్పించాలని సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి జి శశి కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయం లో సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనాకి సిపిఐ నాయకులు , వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శశి కుమార్ మాట్లాడుతూ చిలుకూరు మండలంలో ఏపీవో ఉపాధి హామీ చట్టాన్ని తన చేతిలో చుట్టంగా చేసి ఉపాధి కూలీలకు పని లేకుండా చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టంలో ప్రతి కుటుంబానికి వంద రోజులు పని కల్పించాల్సి ఉండగా ఏపీవో కొన్ని పంచాయతీల్లో సగం పని దినాలు కూడా నిర్వహించకుండా కాలయాపన చేస్తూ ఉపాధి కూలీలకు అన్యాయం చేస్తున్నారన్నారు. ఇకనైనా ఏపీవో సక్రమంగా ఉపాధి హామీ పనులను నిర్వహించి ఉపాధి కూలీలకు జీవనోపాధి కల్పించాలని పేర్కొన్నారు.అదేవిధంగా చిల్లకూరు మండలంలో తొలగించిన ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లను వెంటనే తీసుకొని వారికి పని కల్పించాలని డిమాండ్ చేశారు . ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నియోజక వర్గ అధ్యక్షులు ఏం బెటి చంద్రయ్య, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు బివి రమణయ్య, అంకయ్య, మస్తా నయ్య, ఏఐఎస్ఎఫ్ నియోజక వర్గ నాయకులు యశ్వంత్ , తదితరులు పాల్గొన్నారు.

# తమిళనాడు ఓపెన్ షటిల్ టోర్నమెంట్‌లో సత్తా చాటిన గూడూరు క్రీడాకారులు



**గూడూరు రూరల్ మేజర్ న్యూస్:** గూడూరుకు చెందిన క్రీడాకారులు తమిళనాడు ఓపెన్ షటిల్ బాడ్మింటన్ క్రీడా పోటీలలో సత్తా చాటారు. ఈ పోటీలలో గూడూరు హెల్దీ ఎరీనా స్టేడియంలో శిక్షణ పొందుతున్న క్రీడాకారులు అండర్ 15 విభాగంలో షాహిర్, అండర్ 9, అండర్ 11 విభాగాలలో యశ్విన్ ప్రథమ స్థానంలో నిలిచారు. నిర్వాహకుల నుండి ప్రైజ్ మనీ, షీల్డులు అందుకున్నారు. సోమవారం షటిల్ కోర్టులో ది యంగ్ గూడూర్ షటిల్ బాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు, కోచ్ హర్షవర్ధన్ రెడ్డి క్రీడాకారులను అభినందించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు.

# టెన్నిస్‌లో సత్తా చాటిన ఎంజీఎం కాలేజ్ విద్యార్థి



**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** కాకినాడలో డీఎస్ఏ స్టేడి యంలో అండర్ 19 స్టేట్ లెవెల్ టెన్నిస్ విభాగంలో మూడవ స్థానం సాధించి డిసెంబర్‌లో జరిగే నేషనల్‌కి సెలెక్ట్ అయ్యాడు. ఈ సందర్భంగా ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుద్దూరు ఐశ్వర్య మాట్లాడుతూ క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ఆ దిశగా తమ పిల్లలను క్రీడలు పట్ల తల్లిదండ్రులు అవగాహన కల్పించి ప్రోత్సహించాలని తద్వారా విద్యార్థులలో శారీరక దారుఢ్యం తో పాటు ఆరోగ్యపరంగాను. ఆలోచన పరంగాను ఉత్సాహంగా ముందుంటారని ఈ సందర్భంగా తెలియజేశారు. ఎంజీఎం ఇన్స్టిట్యూషన్స్ విద్యార్థిని, విద్యార్థులను క్రీడలు పట్ల ఎప్పుడు ప్రోత్సహిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంజీఎం గ్రూప్ డైరెక్టర్ గుద్దూరు ఐశ్వర్య. ఎంజీఎం కాలేజ్ ప్రిన్సిపల్ వి.ఎస్ రత్నం. విద్యార్థి తండ్రి తహశీల్ పాల్గొన్నారు.

# నేడు అనూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద నిరసన

**కార్వేటినగరం, మేజర్ న్యూస్:** కార్వేటినగరం మండలం అన్నూరు విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద కూటమి ప్రభుత్వం విద్యుత్ బకాయిలు పెంచడంపై నిరసన కార్యక్రమం నిర్వహించడం గంగాధర్ నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ రమేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గంగాధర నెల్లూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఆరు మండలాల సీనియర్ నాయకులకు, మాజీ అధ్యక్షులకు, మాజీ ఉపాధ్యక్షులకు, ఎస్సీ ,ఎస్టీ ,బీసీ, మైనారిటీ, అనుబంధ మాజీ కమిటీ సభ్యులందరికీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు, మంగళవారం నవంబర్ 2024 న , గంగాధర నెల్లూరు నియోజకవర్గం, కార్వేటి నగరం, చిత్తూరు పుత్తూరు రహదారి మార్గంలో ఉన్న సబ్ స్టేషన్ వద్ద ఉదయం 11 గంటలకు కూటమి ప్రభుత్వం విద్యుత్ సర్దుబాటు రూపంలో ఏడాదికి సుమారు 6000 కోట్ల రూపాయలు మన రాష్ట్ర ప్రజల మీద ఆర్థిక భారాన్ని మోపే ప్రయత్నం చేస్తున్నందున కాంగ్రెస్ పార్టీ శ్రేణుల సమక్షంలో కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం చేపట్టదలిచినాము. కావున కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు, మీడియా మిత్రులు, ప్రతి ఒక్కరూ విచ్చేసి ఈ కార్యక్రమాన్ని జయప్రదం జయప్రదం చేయాలన్నారు.

# సిపిఎం ప్రాంతీయ మహాసభ జయప్రదం చేయండి

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** సీపీఎం శ్రీకాళహస్తి ప్రాంతీయ మహాసభ ఈ నెల 6 వతేదీ బుధవారం శ్రీకాళహస్తి పుచ్చలపల్లి సుందరయ్య భవన్ లో జరుగుతుందని పట్టణ కార్యదర్శి గంధం మణి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుధవారం ఉదయం 10 గంటలకు అంబేద్కర్ కూడలి నుంచి సుందరయ్య భవన్ వరకు భారీ ర్యాలీ, అనంతరం మహాసభ ప్రారంభమవుతుందని తెలిపారు. తదనంతరం నూతన కమిటీ ఎన్నిక ఉంటుందని చెప్పారు. జిల్లా స్థాయి నేతలు సమక్షంలో భవిష్యత్తు కార్యాచరణను రూపొందించే ఈ మహాసభకు పార్టీ సభ్యులు. ప్రజా సంఘాలు. సభ్యులు. సానుభూతిపరులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

# నేడు కొల్లాగుంట ధర్మరాజు ఆలయం వద్ద పొలం పిలుస్తుంది కార్యక్రమం

**కార్వేటినగరం, మేజర్‌న్యూస్:** మండలంలోని మంగళవారం ఉదయం 9.30గంటలకు కొల్లాగుంట లోని ధర్మరాజుల గుడి వద్ద ,11.30 గంటలకి బట్టువారిపల్లి గుడి వద్ద పొలం పిలుస్తోంది కార్యక్రమం జరుగును. కావున అందరు రైతులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని వ్యవసాయ శాఖ అధికారి హేమలత తెలిపారు.

# రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ డాక్టరు సీఎం. రమేష్, డాక్టరు కె. లక్ష్మణ్‌ను కలిసిన బిజెపి నేత కోలా ఆనంద్



**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్ సోమవారం రైల్వే స్టాండింగ్ కమిటీ చైర్మన్ డాక్టరు సీఎం. రమేష్. డాక్టరు కె. లక్ష్మణ్ 18 మంది పార్లమెంటరీ కమిటీ సభ్యులతో కలిసి వీఐపీ బ్రేక్ లో శ్రీ వారి దర్శనం చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ దేశ ప్రధాని నరేంద్ర మోదీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ లకు మంచి ఆరోగ్యాన్ని ఇచ్చి దేశ. రాష్ట్ర అభివృద్ధికి తోడ్పాటు కావలసిన శక్తిని ఇవ్వాలని ఆ దేవ దేవుడైన కలియుగ వైకుంఠం తిరుమలేశుని కోరడం జరిగిందని అన్నారు. గతంలో వైసీపీ పార్టీ పాలకులు చేసిన దేవాలయాలు పవిత్రతను ఇప్పుడున్న ఎన్డీయే ప్రభుత్వాలు కాపాడుతున్నాయని తెలిపారు. కానీ వైసీపీ పార్టీ వారు అధికారం కోల్పోయిగూడా తన తప్పులను సరిదిద్దు కోకుండా. తిరుమల కొండను ఇంకా అపవిత్రం చేయాలనుకోవడం దుర్మార్గమైన చర్య అని సీఎం రమేష్. కె. లక్ష్మణ్ హితవు పలికారు. అందుకు నిదర్శనమే శ్రీవారి ఆలయంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు సిద్ధం వైసీపీ పార్టీ సింబల్ స్టికర్ ను తన షర్టుకి అతికించుకొని ఆలయంలోపలికి వచ్చి శ్రీవారిని దర్శించుకున్నారనీ ఇది చాలా హేయమైన చర్య అని సీఎం రమేష్ చెప్పారు. శ్రీ వారి భక్తులకు అంబటి రాంబాబు క్షమాపణ చెప్పాలని మీడియా ద్వారా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి. అసెంబ్లీ పార్టీ కన్వీనర్ కోలా ఆనంద్. జిల్లా కార్యదర్శి. అసెంబ్లీ పార్టీ కో – కన్వీనర్ మేళాగారం సుబ్రమణ్యం రెడ్డి. నానీ. గిరిధర్. సాయి తదితరులు పాల్గొన్నారు.

# గిరిజనులకు ఇచ్చిన పట్టాలకు భూములు చూపించండి



**దొరవారిసత్రం మేజర్‌న్యూస్ :** దొరవారిసత్రం మండల పరిధిలోని తనియాలి, ఏకొల్లు, ఆనేపూడి, కల్లూరు, మినమలమూడి గ్రామాల గిరిజనులకు ప్రభుత్వం ఇచ్చిన పట్టాలకు భూములు చూపించాలని సోమవారం సిపిఎం జిల్లా ఇన్చార్జి వందవాసి నాగరాజు సమక్షంలో తాసిల్దార్ కార్యాలయం ఎదుట ఎర్రజెండాలతో నిరసన కార్యక్రమం చేపట్టారు.సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక సందర్భంగా ఆయా గ్రామాల నుంచి గిరిజనులు తాసిల్దార్ కార్యాలయం ఎదుట నిరసనకు దిగారు.గతంలో ఇచ్చిన భూములు ఏకొల్లు సర్వే నెంబర్ 463,22బి, తనియాలి సర్వే 01 పట్టాలు ఇచ్చేరు కానీ భూములు చూపించకుండా మమ్ములను మోసం చేశారని మండిపడ్డారు.పట్టాలు ఇచ్చిన గ్రామాల్లో పలు భూ సంబంధ సమస్యలు పరిష్కరించకుండా,భూమి చూపించకపోవడంతో మూకుమ్మడిగా నిరసన చేపట్టారు.ఆయా గ్రామాల్లో వివిధ రకాల భూ అడ్డంకు సమస్యలు ఉండడంతో కొన్ని గ్రామాల్లో అటవీ సిబ్బంది అడ్డంకులు ఉన్నాయన్నారు.వీటన్నిటిని పరిష్కరించి ఇచ్చిన పట్టాలకు భూములు చూపించక పోవడంతో వారి సమస్యలన్నిటిని తాసిల్దార్ శైలకుమారి కి వివరించారు.దీనిపై మెమోరాండంను సమర్పించారు.సమస్యలు పరిష్కరించలేని పక్షంలో కార్యాలయం ఎదుటే నిరవధిక దీక్ష చేపట్టాల్సి ఉంటుందని సిపిఎం నాయకులు హెచ్చరించారు. భూ సమస్యలను పరిశీలిస్తాం! ఏ గ్రామంలో ఎటువంటి అవరోధాలు, అడ్డంకులు ఉన్నాయో నెల రోజులు గడువు లోపు స్వయానా పరిశీలించి సమస్యల పరిష్కారానికి మార్గం చూపుతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు మునయ్య, మనస్వామి, బాలకృష్ణ, బత్తయ్య, కృష్ణారెడ్డి, సరస్వతి, పలు గ్రామాల గిరిజనులు పాల్గొన్నారు.

# బాల కార్మికులను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరం

**- శ్రీకాళహస్తి లేబర్ అధికారి జి రంగనాథ్**




**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** పాన్ ఇండియా బాల కార్మికులు నిర్మూలనలో కార్యక్రమంలో భాగంగా కార్మిక శాఖ అధికారులు. మండల్ లీగల్ సర్వీస్ అథారిటీ. ప్రగతి స్వచంద సేవ సంస్థ సభ్యులతో కలిసి శ్రీకాళహస్తి పట్టణం ఆర్టీసీ బస్టాండ్ వీఎంసి సర్కిల్ పీవీ రోడ్. పెద్ద మసీదు వీధు లలో తనిఖీలు నిర్వహించి రెండు అడలెసెంట్ లేబర్ లను గుర్తించారు. బుచ్చినాయుడు కండ్రిగ మండల పరిధిలో పలు దుకాణాలను తనిఖీలు నిర్వహించినారు. ఈ తనిఖీలలో శ్రీకాళహస్తి సహాయ కార్మిక అధికారి జి రంగనాథ్. తిరుపతి సహాయ కార్మిక అధికారులు జె శ్రీమన్నారాయణ. రాజయ్య. ప్రవీణ్ కుమార్. ప్రగతి స్వచ్ఛంద సేవ సంస్థ కో ఆర్డినేటర్ రాజా రెడ్డి పాల్గొన్నారు.

# స్మశానవాటికలో ముళ్ళ పొదలు తొలగింపు



**శ్రీకాళహస్తి రూరల్, మేజర్‌న్యూస్:** మండలంలోని చల్లపాలెం బీసీ కాలనీ స్మశాన వాటికలో ముళ్ళ చెట్లు. పొదలను తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు. రాచగున్నేరి మాజీ సర్పంచ్ బొల్లినేని జగన్నాథం నాయుడు జెసిబి సహాయంతో క్లీన్ చేసి స్మశానం స్థలాన్ని శుభ్రం చేశారు. గతంలో స్మశానానికి దారి లేక చాలా ఇబ్బందులు పడేవారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రజలు బొల్లినేని జగన్నాథం నాయుడుకి తెలియజేశారు. వెంటనే స్పందించి స్మశానానికి రావడానికి పోవడానికి ఇబ్బందులు లేకుండా జెసిబి లతో శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

# శివయ్య సేవలో మాజీ మంత్రి ఆర్కే రోజా

**శ్రీకాళహస్తి, మేజర్ న్యూస్:** దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు. శ్రీకాళహస్తి మేజర్ న్యూస్: శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం కార్తిక మాసం సందర్భంగా దక్షిణ కైలాసమైన శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంనకు మాజీ మంత్రి ఆర్కే రోజా కుటుంబ%శీ% సభ్యులతో కలిసి స్వామి అమ్మవార్ల దర్శనార్థం విచ్చేశారు. వారికి శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానం మాజీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు స్వాగతం పలికారు. శ్రీకాళహస్తీశ్వర స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అనంతరం దక్షిణామూర్తి వద్ద వారికి శేష వస్త్రాలతో సత్కరించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వారి సురేష్. ప్రసాద్. ఈశ్వర్ సాయి. ముని తదితరులు పాల్గొన్నారు.



# వైభవంగా కుంబాభిషేకే వేడుకలు

**పెళ్లకూరు మేజర్‌న్యూస్:** మండలంలోని పెళ్లకూరు మిట్ట నందు శ్రీశ్రీశ్రీ ముత్తుమారియమ్మ దేవత నూతన ఆలయ విగ్రహ ప్రతిష్ట వేడుకలు ఘనంగా నిర్వహించారు.అమ్మవారిని వివిధ రకముల్లైన పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరణ చేశారు.ఈ సందర్భంగా ముత్తు మారియమ్మ అమ్మవారికి ప్రత్యేకమైన పూజలు హోమాలు నిర్వహించి విగ్రహ ప్రతిష్ట చేశారు.అదే గ్రామానికి చెందిన హృషికేశవరావు అమ్మవారి విగ్రహ ప్రతిష్ట వేడుకల్లో పాల్గొని అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు.అదేవిధంగా కొత్తూరు గ్రామానికి చెందిన కొర్రపాటి సునీల్ కుమార్ నాయుడు వారి సతీమణి కొర్రపాటి రాహేల్ అమ్మవారి ఆశీస్సులతో భక్తులకు అన్నదానం చేశారు.ఈ కార్యక్రమంలో భక్తులు గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



# కోవిడ్ సమయంలో నిలిచిన రైళ్ల పునరుద్ధరణ, కొత్త రైళ్ల కోసం వినతి

**పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ దృష్టికి పలు సమస్యలు నివేదించిన ఎంపీ డా.మద్దిల గురుమూర్తి**

**తిరుపతిరెవెన్యూ, మేజర్‌న్యూస్:** కోవిడ్ సమయంలో నిలిచిన రైళ్లను పునరుద్ధరించడంతో పాటు కొత్త రైళ్లను తిప్పాలని తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి కోరారు. పలు రైల్వే అభివృద్ధి పనులు, వాటిపై అధ్యయనం చేసేందుకు తిరుపతికి వచ్చిన పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ బృందాన్ని ఎంపీ గురుమూర్తి సోమవారం కలిశారు. తిరుపతి తాజ్ హోటల్ లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఎంపీ పలు ప్రతిపాదనలు కమిటీ ముందుంచారు.

**కొత్తగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటుకు వినతి:** తిరుపతి – కాట్పాడి, తిరుపతి – గూడూరు, తిరుపతి నుండి ధర్మవరం, తిరుపతి – యర్రగుంట్ల, తిరుపతి – శ్రీకాళహస్తి నడికుడి మార్గాలను పరిధిగా చేసుకొని తిరుపతి కేంద్రంగా కొత్తగా బాలాజీ రైల్వే డివిజన్ ఏర్పాటు చేయాలనీ ఎంపీ కోరారు. తిరుపతి ఆధ్యాత్మిక నగరం మాత్రమే కాకుండా ప్రముఖ విద్యాసంస్థలకు, పలు పారిశ్రామిక వాడలకు కేంద్రగా ఉందని ఈ జోన్ ఏర్పాటుతో సరకు రవాణా, ప్రయాణికుల రవాణా మెరుగుపడి వెనుకబడిన రాయలసీమ అభివృద్ధికి ఈ రైల్వే జోన్ తోడ్పడుతుందని ఎంపీ అన్నారు. తిరుపతి, రేణిగుంట మీదుగా నెల్లూరు–మైసూర్ మార్గంలో వందేభారత్ ఎక్స్ ప్రెస్ నడపాలి. ఈ రైళ్లను ప్రవేశ పెట్టడం వల్ల భక్తులు, పర్యాటకులకు ఎంతో ప్రయోజనం వుంటుందని ఎంపీ వందేభారత్ రైళ్ళ సేవలకు వినతి పత్రంలో పేర్కొన్నారు. తిరుపతి – విశాఖపట్నం మధ్య వందే భారత్ స్లీపర్ రైలు ప్రవేశ పెడితే వివిధ వర్గాల ప్రయాణికులకు ఎంతో లాభమని ఎంపీ తెలిపారు. కీలకమైన ఈ మార్గంలో వందే భారత్ స్లీపర్ రైలు ప్రవేశ పెట్టాలనే డిమాండ్‌ను పరిగణలోకి తీసుకోవాలని ఆయన కోరారు. అలాగే కొత్త రైళ్ల సేవలుపై మాట్లాడారు. తిరుపతి – బ్రహ్మపూర్‌బీ తిరుపతి – వారణాసి , అయోధ్యబీ తిరుపతి – షిర్డీ (ప్రతిరోజూ)బీ నెల్లూరు – తిరువణ్ణామలై (తిరుపతి– చిత్తూరు) రైళ్లను ప్రవేశ పెట్టాలని ఎంపీ గురుమూర్తి ప్రతిపాదించారు. అలాగే కొత్త మెమో రైళ్లు తిరుపతి నుంచి నెల్లూరుబీ తిరుపతి – కడప మార్గాల మధ్య ప్రవేశ పెట్టాలని కోరారు. అటాగే ఇప్పటికే ఉన్న రైళ్ల పొడిగింపు, షెడ్యూళ్లకు మార్పులుపై మాటాడారు.



-ప్రస్తుతం చిత్తూరు వరకు నడుస్తున్న వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్ (12798) కుప్పం వరకు పొడిగించాలి.

-సికింద్రాబాద్ నుంచి గూడూరు మధ్య నడుస్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ (12710) తిరుపతి వరకు పొడిగించాలి.

-తిరుపతి – సికింద్రాబాద్ మధ్య వారంలో అయిదు రోజులు మాత్రమే నడుస్తున్న పద్మావతి ఎక్స్‌ప్రెస్ (12763)ని ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ప్రతిరోజూ నడపాలి.

-పాకాల, ధర్మవరం, గుంతకల్ మీదుగా వారానికి రెండు రోజులు నడుస్తున్న తిరుపతి–సికింద్రాబాద్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ (12731)ని ప్రతి రోజూ నడపాలి.

-తిరుపతి – రామేశ్వరం మధ్య వారంలో 3 రోజులు నడుస్తున్న మీనాక్షి ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ నడపాలి.

-తిరుపతి –బెంగళూరు మధ్య వారంలో 3 రోజులు నడుస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజూ నడపాలి.

-తిరుపతి – కోయంబత్తూరు మధ్య వారంలో 4 రోజులు నడుస్తున్న ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ ప్రతిరోజూ నడపాలి.

-తిరుపతి – షిర్డీ వారానికి ఒక రోజు మాత్రమే నడుస్తున్న రైలుని ప్రతి రోజూ నడపాలి.

**రైళ్లను ఆపడానికి అభ్యర్థన:** వెందోడు రైల్వే స్టేషన్‌లో రైలు నంబర్లు 17405/17406 కృష్ణా ఎక్స్‌ప్రెస్, 17480/17489 తిరుపతి– పూరి – తిరుపతి ఎక్స్‌ప్రెస్, తిరుమల ఎక్స్‌ప్రెస్‌లను ఆపాలి.

-దక్షిణ రైల్వే జోన్ పరిధిలోని నాయుడుపేట, సూళ్లూరుపేట స్టేషన్లలో చెన్నై ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నెం. 12604), నవజీవన్ ఎక్స్‌ప్రెస్ (రైలు నంబర్లు 12655/56), కాకినాడ పోర్ట్–చెంగల్పట్టు ఎక్స్‌ప్రెస్ (ట్రైన్ నంబర్ 17644) నిలుపుదల కోసం అభ్యర్థించడం జరిగింది. చెన్నై నుంచి సూళ్లూరుపేట వరకు నడుస్తున్న మెమూ రైళ్లను నాయుడుపేట వరకు పొడిగించవలసినదిగా కోరారు.

**మౌలిక సదుపాయాల అభివృద్ధి:** రేణిగుంట నుంచి గూడూరు, తిరుపతి నుండి రేణిగుంట మధ్య 3వ లైన్ అభివృద్ధి ఎంతో అవసరం. ఈ మార్గంలో ప్రయాణికులు రద్దీ ఎక్కువగా వుంది. ఈ రెండు స్టేషన్ల మధ్య రైళ్లు ఎక్కువగా నడపబడుతున్నందున, మూడవ లైన్ సులభతరమైన కార్యకలాపాలను అనుమతిస్తుంది, నిరీక్షణ సమయం, ఆలస్యాన్ని తగ్గిస్తుంది, రేణిగుంట

**రైల్వే స్టేషన్‌ను మరింత అభివృద్ధి చేయాలి:** గూడూరులోని అంబేద్కర్ నగర్ సమీపంలో I, II పట్టణాలను కలిపే అండర్‌పాస్ వెంకటగిరి, రాజంపేట, రాపూరు, పొదలకూరు వంటి పట్టణాలకు ప్రయాణించేందుకు ప్రధాన మార్గంగా ఉంది. ఈ మార్గంలో ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉన్నందువలన ఇరుకుగా ఉన్న ఈ అండర్‌పాస్‌ను సాఫీగా విస్తరించాల్సిన అవసరం ఎంతైనా ఉందని వారికీ తెలియజేసారు. అలాగే తిరుపతి – కాట్పాడి మార్గాన్ని డబల్ లైన్ చెయాలనీ ప్రతిపదించడం జరిగింది. రేణిగుంట రైల్వే స్టేషన్ తిరుపతికి సేవలందించే ఒక ప్రధాన జంక్షన్, రేణిగుంట స్టేషన్‌కి "తిరుపతి ఈస్ట్" స్టేషన్‌గా పేరు మార్చడం, తిరుచానూరు స్టేషన్‌ను తిరుపతి సెంట్రల్‌గా మార్పునకు పరిశీలించాలి. ఈ పేరు మార్పు ప్రయాణికులకు మెరుగైన స్పష్టతను అందించడానికి, తిరుపతి నగరానికి సేవలు అందించే కీలక స్టేషన్‌గా మారుతుందని స్టాండింగ్ కమిటీ దృష్టికి తిరుపతి ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి తీసుకెళ్లారు.

# దళిత గిరిజన భూములు కొనుగోలు చేయరాదు

**- సీపీఐ నేత మించల శివకుమార్ డిమాండ్**
**- ఆర్డిఓకి సిపిఐ వినతి**

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి నియోజకవర్గంలో దళిత గిరిజన భూములను కొంతమంది ఇతర ప్రాంతాలు వారి వద్ద కాస్త కోస్తా ముడుపులు తీసుకొని దళిత గిరిజనుల భూములను లక్ష రూపాయలుతో కొనుగోలు చేసి ఇతర ప్రాంతాలు వారికి 20 లక్షలుకు అమ్మి జేబులు నింపుకుంటున్నారని సోమవారం శ్రీకాళహస్తి ఆర్డీవో కార్యాలయం వద్ద సిపిఐ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఆర్డీవో భాను ప్రకాష్ రెడ్డికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు జిల్లా సహాయ కార్యదర్శి తులసి రాజన్. మించల శివకుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీకాళహస్తి నియోజకవర్గంలో రామాపురం రెవిన్యూ ఇతర గ్రామాల లో నివాసమున ఉన్నటువంటి దళిత గిరిజన భూములను గుర్తించి కొంతమంది గ్రూపులుగా ఏర్పడి నిరుపేదలు సాగు చేస్తున్నటువంటి భూములను ఇతర ప్రాంతాలు వారికి ఎకరా లేక రెండు ఎకరాలు లక్ష రెండు లక్షలు లెక్కన కొనుగోలు చేసి భూ బకాసురులకు అమ్మి నిరుపేదలను కటిక నిరుపేదలుగా చేస్తున్నారని మండిపడ్డారు అర్హులైన నిరుపేదలను ప్రభుత్వం గుర్తించి భూమి కల్పిస్తే ఆ భూములు నమ్ముకొని 40 సంవత్సరాలుగా వర్షాధార పంట పెట్టుకొని జీవనం గడుపుతున్నారని అలాంటి భూములను ప్రైవేటు వ్యక్తులకు కొనుగోలు చేస్తే వాళ్ళ బ్రతుకు మరింత పేదరికంలోకి నెట్టబడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దళిత గిరిజన భూములను కొనరాదు అమ్మ రాదు అని ప్రభుత్వాలు చెబుతున్న కొంతమంది పేదల బ్రతుకులతో దోబూసులాడుతున్నారని అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాలలో దళిత గిరిజన భూములను కొనరాదు అమ్మ రాదని దండోరా వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆర్డిఓ భాను ప్రకాష్ రెడ్డి మాట్లాడుతూ దళిత గిరిజనులు సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాజయ్య. మనీ. వెంకటమ్మ. వినాయక. రత్నమ్మ. నాగేశ్వరి. లతమ్మ. గోపి తదితరులు పాల్గొన్నారు.



# గుండోడు కనుమ రోడ్డుకు తొలి అడుగు



**రామచంద్రపురం, మేజర్ న్యూస్:** ఒకనాటి కార్వేటినగరం రాజులు రాకపోకలు సాగించిన గుండోడు కనం రాజుల బాటకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని చొరవతో నేటకి మహర్దశ ప్రాప్తించనున్నది. మండలంలో నెన్నూరు నుండి తాటి తోపు కండ్రిగ వరకు ఉన్న గుండోడు కనుమ రోడ్డు రోడ్డు అభివృద్ధికి చంద్రగిరి నియోజకవర్గ పంచాయతీరాజ్ డిఈ ప్రభాకర్ రెడ్డి, ఏఈ చిన్నయ్యలు సోమవారం పరిశీలన చేసారు. 2021లో వచ్చిన భారీ వర్షాలకు రాయల చెరువు పూర్తిగ నిండటంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. ఆ సమయంలో గుండోడు కనుమ రాజుల బాట ప్రజల రాకపోకలకు ఎంతో దోహద పడింది. ఎన్నికల ప్రచార సమయంలో ప్రస్తుత చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని గ్రామాలకు వచ్చిన సందర్భంలో ప్రజలు గుండోడు కనుమ రాజా బాటను గురించి ఆయన దృష్టికి తీసుకుని వెళ్లారు. కార్వేటి నగరం రాజులు శిస్తు వసూలు చేయటానికి తాటి తోపు కండ్రిగ నుంచి నెన్నరీరు వరకు గుండోడు కనుమలో రాళ్లు పేర్చి బాట ఏర్పాటు చేశారని, అటు పిమ్మట తమిళనాడు నుంచి వచ్చే స్వామి వారి భక్తులు కూడా ఈ దారినే నడిచి వెళ్లే వారిని వివరించారు. రామచంద్రాపురం రాయల చెరువు కుప్పం బాదురు మార్గంలో రోడ్లు భవనాల శాఖ రహదారి ఏర్పాటు చేయడంతో గుండోడు కనుమ దారి మనుగడలో లేకుండా పోయిందని తెలిపారు. రాయల చెరువు నిండిన సమయంలో ప్రధాన రహదారి పూర్తిగా నీటమునుగు తున్నందున గుండోడు కనుమ రహదారి ఎంతో సౌకర్యంగా ఉంటుందని తెలియజేశారు. ప్రజలు కోరిన విధంగా రహదారిని అభివృద్ధి చేయటానికి ఎమ్మెల్యే నాని పంచాయతీ రాజ్ శాఖ అధికారులతో కూలంకషంగా చర్చించారు. ఆయన కోరిక మేరకు అధికారులు తాటితోపు కండ్రిగ నుంచి గుండోడు కనుమ లోని పాత రాజబాట ద్వారా నెన్నరీరు వరకు నడిచి వచ్చారు. ఈ సందర్భంగా పంచాయతీ రాజ్ డి ఈ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోడ్డును అభివృద్ధి చేస్తే తిరుపతి పచ్చికాపలం ప్రయాణ సమయం తగ్గుతుందని చెప్పారు. 2. 5 కిలోమీటర్ల దూరం ఉందని దీనికి అంచనాలు తయారు చేసి ఎమ్మెల్యే ద్వారా ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు.

# పవిత్ర పుణ్యక్షేత్రాన్ని అపవిత్రం చేసిన అంబటి రాంబాబుపై చర్యలు తీసుకోవాలి

## టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్

**చిత్తూరుఅర్బన్ మేజర్‌న్యూస్:** ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన హిందూ దేవాలయం తిరుమల తిరుపతి దేవస్థానం లోకి మాజీ మంత్రి అంబటి రాంబాబు మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బ్యాడ్జ్ తో స్వామి వారి దర్శనానికి వెళ్ళటం అత్యంత దారుణమైన సంఘటన అని టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి సప్తగిరి ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం స్థానిక టిడిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సప్తగిరి ప్రసాద్, ఇతర టిడిపి నాయకులు మాట్లాడుతూ మాజీమంత్రి అంబటి రాంబాబు తమ నాయకుడు జగన్ మోహన్ రెడ్డి దగ్గర స్వామి భక్తి ప్రదర్శించడానికి కోట్లాదిమంది హిందూ భక్తుల మనోభావాలను దెబ్బతీశారని,. వైసీపీ నాయకులకి దేవదేవుడు వెంకటేశ్వర స్వామి అంటే లెక్క లేకుండా పోయిందని, తాను ఏమి చేసినా చెల్లి పోతుందని, మనల్ని అడిగే వారు ఎవరూ లేరని మదమెక్కి వ్యవహరిస్తున్నారు. కుక్కతోక వంకర అంబటి బుద్ధి వంకర టింకర ,అన్నట్టుంది ఎలుకతోలు తెచ్చి ఏడాది ఉతికిన. నలుపు నిలుపే గాని తెలుపు కాదు అన్నట్టు వీరిని ఎంత తిట్టినా, ఎన్ని విమర్శలు చేసినా, వీళ్ళ బుద్ధి మారదు. వీళ్ళ వ్యవహారం మారదు, అన్నట్టుగా ఉంది అంబటి రాంబాబు వ్యవహారం. కల్తీ నెయ్యి వ్యవహారం పైన భక్తుల మనోభావాలు గాయపడి, ఉంటే. జాగ్రత్తలు తీసుకోవాల్సింది పోయి ,ఒక మాజీ మంత్రిగా బాధ్యతలు నిర్వహించి , జగన్మోహన్ రెడ్డి బ్యాడ్జిని వేసుకొని దర్శనానికి వెళ్ళటం అతని అహంకారానికి నిదర్శనమని,. తిరుమల క్షేత్రంలో రాజకీయ కార్యక్రమాలు , బ్యానర్లు , స్టిక్కర్లు , జెండాలు , నినాదాలు గాని చేయకూడదని నిబంధనలు ఉన్నప్పటికీ ఇవేమీ పట్టించుకోకుండా జగన్మోహన్ రెడ్డి మెప్పు పొందడం కోసం స్వామివారిని అపవిత్రం . అంబటి అపవిత్రం చేశారన్నారు. మాజీ మంత్రి రోజా, అంబటి రాంబాబును తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు 10 సంవత్సరాల పాటు వెంకటేశ్వర స్వామి దర్శనానికి రాకుండా నిషేధం విధించాలని ఇందుక్కు సంబంధించి చట్టపరంగా చర్యలు తీసుకొని ,అంబటి రాంబాబుని అరెస్టు చేయాలని, టిడిపి నాయకులు తిరుమల తిరుపతి దేవస్థానం అధికారులు విజ్ఞప్తి చేశారు. వెంకటేశ్వర స్వామి సన్నిధిలో రాజకీయాలు చేసినటువంటి వారు పుట్టగతులు లేకుండా వయ్యారన్న విషయాన్ని అంబటి రాంబాబు,ఆర్కే రోజా గుర్తుపెట్టుకోవాలని, ఒకపక్క అంబటి రాంబాబు, ఆర్కె రోజా, మరోపక్క విజయ్ సాయి రెడ్డి వీళ్ళందరూ తిరుమల క్షేత్రంలో ఉద్దేశపూర్వకంగానే రాజకీయ కార్యక్రమాలు, రాజకీయ ప్రకటనలు చేయడం ,సవాళ్లు విసరడం ఇవన్నీ చేస్తున్నారన్నారు. ఈ విలేకరుల సమావేశం లో టిడిపి జిల్లా కార్యాలయ కార్యదర్శి మోహన్ రాజ్ , తవణంపల్లి మండల పార్టీ ప్రధాన కార్యదర్శి మధు యాదవ్, మైనార్టీ సెల్ నాయకుడు షబ్బీర్ భాయ్, తెలుగు రైతు కార్యదర్శి జైపాల్ తదితరులు పాల్గొన్నారు.





## మాజీ కౌన్సిలర్ మురళికి మాజీ ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి పరామర్శ

**శ్రీకాళహస్తి, మేజర్‌న్యూస్:** శ్రీకాళహస్తి మున్సిపల్ మాజీ కౌన్సిలర్. మాజీ రిపబ్లిక్ క్లబ్ అధ్యక్షులు సిద్ధులు గారి మురళి అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఈ సందర్భంగా శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు బియ్యపు మధుసూదన్ రెడ్డి. దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు. సిరాజు భాషా గోరా భాష. కంట ఉదయ్ కుమార్. పటాన్ ఫరీద్. ఫజల్. బుల్లెట్ జై శ్యామ్, గరికపాటి చంద్ర. శ్రీవారి సురేష్  చింతామణి పాండు. ఉత్తరాజి శరవణ. విజయ్ కుమార్ రెడ్డి. గణేష్ అట్ల రమేష్. తీగల చిన్న. గణేష్. సుధాకర్. నరసింహులు. కిరణ్ యానాదయ్య తదితరులు పరామర్శించరు.

## ఆర్డబ్ల్యూఎస్ ఏఈని కలిసిన వైకాపా నేతలు



**ఓజిలి, మేజర్‌న్యూస్:** మండలంలోని ఆరిమేనుపాడు గ్రామ ఉపసర్పంచ్ సుకుమార్ రాజు, మాజీ మైనార్టీ అధ్యక్షులు అజ్మతుల్లా సోమవారం ఓజిలి ఆర్డబ్ల్యూఎస్ ఏఈ శ్రీనివాస్ చౌదరిని నాయుడుపేటలోని ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఆరిమేనుపాడు గ్రామంలో నీటి వనరులపై ఆయనతో చర్చించారు. రానున్న వర్షాకాలం దృశ్య నీరు ఎక్కడ కలుషితం చెంద కుండా పైపులు లీకేజీలు కాకుండా చర్యలు తీసుకోవాలి సూచించారు. త్వరలో గ్రామాన్ని క్షుణ్ణంగా పరిశీలించి భవిష్యత్తు కార్యాచరణ చేద్దామన్నారు.

## భౌతికశాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య దేవప్రసాద్ రాజు

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా ఆచార్య దేవ ప్రసాద్ రాజు నియమితులయ్యారు. ఈ మేరకు పరిపాలన భవనం ఉన్నతాధికారులు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం ఆయన పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆచార్య దేవప్రసాద్ రాజు 2007లో భౌతిక శాస్త్రంలో అసోసియేట్ ప్రొఫెసర్ గా చేరి, 2017లో ఆచార్యులుగా పదోన్నతి పొందారు. హాస్టల్ వార్డెన్ గా, డిప్యూటీ వార్డెన్ గా, ఏపీ ఆర్ సెట్ కన్వీనర్ గా వర్సిటీలోని పలు హోదాలలో పరిపాలన బాధ్యతలను నిర్వహించారు. భౌతిక శాస్త్ర విభాగాధిపతిగా పదవి బాధ్యతలు స్వీకరించిన ఆచార్య దేవ ప్రసాద్ రాజును భారత విద్యార్థి సమాఖ్య నేతలు కామ్రేడ్ సీతారాం ఏచూరి పుస్తకాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు అక్బర్, రవి, అశోక్, మాధవ కృష్ణ, నరేంద్ర అభినందనలు తెలిపారు.




# రైల్వే స్టాండింగ్ కమిటీకి రైల్వే అభివృద్ధి పనులపై వినతి

### పలు ప్రాంతాల రైల్వే లైన్ అభివృద్ధి రైళ్లు పొడిగింపు చేపట్టండి
### పార్లమెంట్ అధ్యక్షులు నరసింహ యాదవ్

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** తిరుపతి పర్యటనలో భాగంగా తిరుపతికి విచ్చేసిన సెంట్రల్ రైల్వే స్టాండింగ్ కమిటీ సభ్యులు సీఎం రమేష్‌కు తిరుపతి రైల్వే అభివృద్ధి పనులపై టిడిపి పార్లమెంట్ అధ్యక్షులు నరసింహయాదవ్ సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ విశాఖపట్నం సౌత్ కోస్ట్ న్యూ రైల్వే జోన్‌గా భారతీయ రైల్వే ప్రకటించిందని, దీనితోపాటు విజయవాడ, గుంటూరు, గుంతకల్లు కొత్త రైల్వే డివిజన్లను ప్రకటించి, తిరుపతిని కొత్త రైల్వే బాలాజీ డివిజన్‌గా ప్రకటించాలని కోరారు. టెంపుల్ సిటీ తిరుపతికి కొత్త రైల్వే డివిజన్‌గా మారితే యాత్రికులకు, ప్రజలకు కూడా ఎంతో ఉపయోగకరంగా ఉంటుందన్నారు. బస్టాండ్ వద్ద అంబేద్కర్ సర్కిల్ దక్షిణం వైపు నుంచి వెంకటేశ్వర థియేటర్ వైపు రైల్వే అండర్ బ్రిడ్జి ప్రజల ట్రాఫిక్ నియంత్రణ కోసం రైల్వే అండర్ బ్రిడ్జిని త్వరగా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. తిరుచానూరు రైల్వే స్టేషన్‌కు అదనంగా రెండు ప్లాట్‌ఫారమ్‌లను జోడించి, ఆ కొత్త ప్లాట్‌ఫారమ్‌పై కొత్త రైళ్లను నడిపేందుకు ప్రతిపాదన తీసుకురావాలన్నారు. సికింద్రాబాద్ నుండి గూడూరు జంక్షన్ వరకు ఉన్న సింహపురి ఎక్స్‌ప్రెస్‌ను ప్రయాణికుల సౌకర్యార్థం రేణిగుంట జంక్షన్ వరకు పొడిగించాలన్నారు. వెస్ట్ రైల్వే స్టేషన్‌ను అభివృద్ధి చేసి మదనపల్లి, కాట్పాడికి లోకల్ రైళ్లను తిరుపతి నుంచి నడిపేలా అభివృద్ధి చేయాలని, తిరుపతి నుంచి కాట్పాడి జంక్షన్ వరకు ఉన్న సింగిల్ లైన్‌ను డబుల్‌లైన్‌గా మార్చే ప్రతి పాదనను కోరారు. తిరుపతి నుండి కోయంబత్తూరు బెంగుళూరుకు ఇంటర్ సిటీ ఎక్స్‌ప్రెస్ రైలు వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తుందని, ప్రజల సౌకర్యార్థం ప్రతిరోజు నడపాలని కోరా రు. పదేళ్ల క్రితం తిరుపతి నుండి వారణాసికి వారానికి మూడు రోజులు నడిచే రైళ్లు 10 సంవత్సరాల క్రితం రద్దు చేయబడ్డాయి, భారతీయ రైల్వేలు ఈ తిరుపతి నుండి వారణాసి రైళ్లను మునుపటిలా కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. తిరుపతి నుంచి రామేశ్వరం వెళ్లే మీనాక్షి ఎక్స్‌ప్రెస్ రైళ్లు ప్రస్తుతం వారానికి మూడు రోజులు మాత్రమే నడుస్తుండగా, ప్రతిరోజూ ప్రజలకు అందుబాటులో ఉండేలా చూడాలని ప్రతిపాదన చేపట్టాలన్నారు. నగరంలోని హోండా షోరూమ్ సమీపంలో రైల్వే అండర్ బ్రిడ్జి ఇప్పటికే మంజూరు చేశారని, భారీ ట్రాఫిక్ నియంత్రణ కారణంగా, ఈ రైల్వే అండర్ బ్రిడ్జి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు. పద్మావతి ఫ్లోర్ మిల్లు వద్ద, శెట్టిపల్లి రైల్వే గేట్ సమీపంలో ఇప్పటికే రైల్వే అండర్ బ్రిడ్జి మంజూరైంది, రద్దీ ఎక్కువగా ఉన్నందున, ఈ రైల్వే అండర్ బ్రిడ్జి పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని కోరారు.శ్రీకాళహస్తి నుంచి నడికుడి వరకు కొత్త రైలు మార్గం ఇప్పటికే మంజూరైంది. ఈ కొత్త రైలు మార్గాన్ని వీలైనంత త్వరగా పూర్తి చేయాలని విజ్ఞప్తి చేశారు. పద్మావతి మహిళా కళాశాల సమీపంలోని కళాశాల విద్యార్థులకు, ప్రజా సౌకర్యాల ప్రయోజనం కోసం రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం ఈ కొత్త ప్రతిపాదనను తీసుకురావాలన్నారు. కార్పొరేటర్ ఆర్ సి మునికృష్ణ, పార్లమెంట్ కార్యదర్శి ఎ.యశ్వంత్ రెడ్డి, రాజయ్య, మీడియా కోఆర్డినేటర్ చెంగయ్య, బిసిసెల్ నాయకులు చిత్తూర్ రవి శంకర్ యాదవ్, చల్ల, గంధంబాబు వినతి ఇచ్చిన వారిలో ఉన్నారు.



# అవినీతి రహిత సమాజం అందరి బాధ్యత

**తిరుపతి ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్:** అవినీతి రహిత సమాజ నిర్మాణంలో భాగస్వాములై బాధ్యతగా అందరూ వ్యవహరించాలని ఎన్ఎస్ఎస్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఏ చందులాల్ పిలుపునిచ్చారు. జాతీయ సంస్కృతి విశ్వవిద్యాలయంలో గత వారం రోజులుగా విజిలెన్స్ అవగాహన వారోత్సవాల నిర్వహణ ద్వారా అవినీతి రహిత సమాజం నిర్మాణం చేపట్టే విధానంపై వివిధ కార్యక్రమాలు చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం విజిలెన్స్ అవేర్నెస్ వీక్ రాష్ట్రీయ సేవా సమితి, ఎన్ఎస్ఎస్ యూనిట్-2 ద్వారా జిల్లాలోని నారావారిపల్లెలో గ్రామసభ నిర్వహించారు. ఎన్.ఎస్.ఎస్ సెల్ కోఆర్డినేటర్ డా.ఏ.చందులాల్ మాట్లాడుతూ అవినీతిని మనం ఏ విధంగా అడ్డుకోవచ్చు? విజిలెన్స్ అవేర్నెస్ వీక్ ద్వారా అవినీతిని ఎదుర్కొనేందుకు మనకు సలహాలు సూచనలు ఏమిటి? అనే అంశంపై వివరించారు. విజిలెన్స్ అవేర్నెస్ వీక్ అడిషనల్ కోఆర్డినేటర్ డా. సీతారాం శర్మ మాట్లాడుతూ అవినీతి రహిత సమాజ నిర్మాణమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని వివరించారు. అనంతరం ఎన్.ఎస్.ఎస్ యూనిట్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ డా. కనపాల కుమార్ మాట్లాడుతూ అవినీతిని మనం గ్రామస్థాయి నుంచి ఎదుర్కొనడం మొదలుపెట్టినట్లయితే మన ఊరు, మన ప్రాంతమంతా కూడా ఉన్నత అభివృద్ధి పథంలో ముందుకు వెళుతుందని, అవినీతిని ప్రశ్నించడంలో ఎట్టి పరిస్థితుల్లో మనం వెనకడుగు వేయకూడదని సభికులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయం ఎన్.ఎస్.ఎస్ సహాయకుడు, బి.రవి నాయుడు, నారావారిపల్లెలోని గ్రామస్తులు పాల్గొన్నారు.

